

మహబూబ్‌నగర్ వార్త

నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల/నారాయణపేట


# రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి

- బస్తీ దవాఖాన భవనాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలి
- అధికారులను ఆదేశించిన వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, జనవరి 8 ప్రభాతవార్త:** కొత్తకోట మండల పరిధిలోని పామాపురం, అప్పరాల ప్రాథమిక వ్యవసాయ సహకార కేంద్రం సందర్శించి యూరియా విక్రయ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యూరియా పంపిణీ చేసే ప్రతి విక్రయ కేంద్రం వద్ద అక్కడికి వచ్చే రైతుల కోసం షామియానాతో పాటు కుర్చీలు ఏర్పాటు చేయాలని సూచించారు. అదేవిధంగా యూరియా కొనుగోలు కోసం వచ్చే రైతులను ఎక్కువ సేపు వేచి ఉండకుండా త్వరగా వారికి కావాల్సిన యూరియా ఇచ్చి పంపే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. రైతులకు యూరియా విక్రయించినప్పుడు సంబంధిత రిజిస్టర్లలో వారి పాస్ బుక్ వివరాలతో పాటు, ఎంత విక్రయిస్తున్నారనే సమాచారాన్ని కూడా నమోదు చేయాలన్నారు. ఆధార్ కార్డు, పాస్ పుస్తకం ఆధారంగా పంపిణీ చేయాలని సూచించారు. ప్రతి యూరియా సేల్ పాయింట్ వద్ద వ్యవసాయ శాఖ తరపున తప్పనిసరిగా ఒక ఏఈఓను కేటాయించి పర్యవేక్షణ కొనసాగించాలనిసూచించారు.అదేవిధంగా ప్రతి యూరియా విక్రయ కేంద్రాల వద్ద అక్కడ యూరియా నిల్వకు సంబంధించిన బోర్డు ఏర్పాటు చేయాలని సూచించారు. దాంతోపాటుగా సమీపంలోని ప్రైవేటు ఫర్టిలైజర్ దుకాణాలలో ఎక్కడ ఎంత స్టాకు ఉందని వివరాలను కూడా బోర్డుపై ఏర్పాటు చేయాలన్నారు.

**బస్తీ దవాఖాన భవనాన్ని వారం రోజుల్లో పూర్తి చేయాలి :** కొత్తకోట మండల కేంద్రంలో ఆత్మకూర్ రహదారిలో నూతనంగా నిర్మిస్తున్న బస్తీ దవాఖాన భవన నిర్మాణ పనులను కలెక్టర్ గురువారం పరిశీలించారు. నిర్మాణం చివరి దశకు చేరుకున్న బస్తీ దవాఖాన భవన పనులువారం రోజుల్లోగావేగంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ విభాగం అధికారులను ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పూర్తి చేసి భవనాన్ని ప్రారంభించేందుకు సిద్ధంగా తీర్చిదిద్దాలని సూచించారు. జిల్లా వ్యవసాయ శాఖ ఇన్చార్జి అధికారి దామోదర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సాయినాథ్ రెడ్డి, ఇతర అధికారులు తదితరులు కలెక్టర్ వెంట ఉన్నారు.



యూరియా విక్రయ ప్రక్రియను పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్

# రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

- రోడ్డు భద్రత నియమాలు పాటించడంలో వనపర్తి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుదాం
- రోడ్డు ప్రమాదాల వల్ల ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారు
- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీత రెడ్డి, ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి, జనవరి8, ప్రభాతవార్త:** రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా జిల్లా రోడ్డు రవాణా శాఖ ఆధ్వర్యంలో గురువారం ఐ.డి.ఓ.సి ప్రాంగణం నుండి నల్ల చెరువు వరకు నిర్వహించిన భారీ బైక్ ర్యాలీని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి, జిల్లా ఎస్పీ డి సునీత తో కలిసి జెండా ఊపి ప్రారంభించడమే కాకుండా స్వయంగా ర్యాలీలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక కార్యక్రమంలో పాల్గొన్న స్థానిక శాసన సభ్యులు తూడి మేఘా రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత నియమాలు పాటించని వారికి తాము కూడా ఎప్పటికీ సహకరించబోమని కరాఖండిగా చెప్పారు. రోడ్డు భద్రతా నియమాలు పాటించని వారిపై అధికారులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. అధికారులు రోడ్డు భద్రతపై ప్రజల్లో అవగాహన కల్పించడమే కాకుండా ప్రభుత్వ సిబ్బంది కూడా ప్రతి ఒక్కరు నియమాలు పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు భద్రత నియమాలు పాటించడంలో వనపర్తి జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుదామని చెప్పారు. పదో తరగతి, ఇంటర్మీడియట్ విద్యార్థులకు ప్రతిరోజు రోడ్డు భద్రతపై కొంతఅవగాహన కల్పించాలని సూచించారు. రాష్ డ్రైవింగ్ కారణంగా జీవితాలను నాశనం చేసుకోకుండా, ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా నడుచుకోవాలని సూచించారు. కాలికో, చేతికో ప్రమాదం జరిగితే కృత్రిమ అవయవాలను అమర్చడానికి వీలుంటుంది కానీ తలకు గాయాలయితే ప్రాణాలకే ప్రమాదం కాబట్టి హెల్మెట్ తప్పనిసరిగా వాడాలని సూచించారు. రోడ్ సేఫ్టీ పై పత్రిక విలేకరులు ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కథనాలు రాయాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బైక్ పై వెళ్లే ప్రతి ఒక్కరు హెల్మెట్ ధరించి తప్పక రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. రోడ్డు భద్రత నియమాలు మనం పాటించడమే కాకుండా ఎదుటివారిలో -మిగతా4లో..



ఐడిఓసి నుండి మినీ ట్యాంక్ బండ్ వరకు బైక్ ర్యాలీగా బయలుదేరిన కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్యే

# స్పీడో మీటర్లకు.. తల్లిదండ్రులను గుర్తుచేసే స్టిక్కర్లు అంటించాలి

- డ్రైవింగ్ సమయంలో భద్రతా నియమాలు తప్పనిసరిగా పాటించాలి
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో మంత్రి వాకిటి శ్రీహరి



రోడ్డు భద్రత మాసోత్సవాల్లో విద్యార్థులతో మంత్రి వాకిటి శ్రీహరి

**నారాయణ పేట, జనవరి8 ప్రభాతవార్త:** నారాయణ పేట జిల్లా కేంద్రంలో నిర్వహించిన జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో రాష్ట్రక్రీడా, పశుసంవర్ధక, యువజన సర్వీసుల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. జనవరి 1వ తేదీ నుంచి ప్రారంభమైన ఈ కార్యక్రమంలో విద్యార్థులచే రోడ్డు భద్రతపై మంత్రి ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఉద్దేశించి మంత్రి మాట్లాడుతూ, మన దేశంలో ప్రతి సెకనుకు ఒక రోడ్డు ప్రమాదం జరుగుతోందని, భద్రతా నియమాలు పాటిస్తే చాలా వరకు ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. తల్లిదండ్రులు వాహనం నడిపేటప్పుడు పిల్లలను గుర్తుంచుకోవాలని, యువకులు డ్రైవింగ్ చేసేటప్పుడు ఇంట్లో ఉన్న తల్లిదండ్రులను మనసులో ఉంచుకోవాలని సూచించారు. రోడ్డు ప్రమాదం కారణంగా తనకు ఎంతో ఇష్టమైన క్రికెట్ ఆటను దేశ జట్టులో ఆడే అవకాశాన్ని కోల్పోయానని మంత్రితన వ్యక్తిగత అనుభవాలను విద్యార్థులతో పంచుకున్నారు.మనం భద్రతా నియమాలు పాటించినా ఎదుటి వ్యక్తి జాగ్రత్తగా లేకపోతే ఇరువురికీ ప్రమాదం సంభవించే అవకాశం ఉందని హెచ్చరించారు. మన శరీరంలోని ప్రతి అవయవం విలువైనదని, అందుకే వాహనాలు నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించడం, సీట్‌బెల్ట్ పెట్టుకోవడం వంటి భద్రతా నియమాలను పాటించాలన్నారు. బైక్‌లను నడిపేటప్పుడు స్పీడోమీటర్లపై అమ్మ, నాన్న అనిగుర్తు చేసే స్టిక్కర్లు అంటించే విధంగా చర్యలు తీసుకోవాలని రవాణా అధికారులను మంత్రి ఆదేశించారు. లక్ష స్టిక్కర్ల ముద్రణకు కావాల్సిన ఖర్చును తానే భరిస్తానని, ప్రతి బైక్‌కు అవి అంటించేలా చూడాలని అధికారులకు సూచించారు.

యువకులు బైక్‌లపై స్టంట్లు చేయడం పూర్తిగా మానుకోవాలని హితవు పలికారు.కోట శ్రీనివాసరావు, బాబు మోహన్, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, అజహరుద్దీన్ వంటి ప్రముఖుల కుమారులు కూడా రోడ్డు ప్రమాదాల్లో మృత్యువాత పడ్డారని మంత్రి గుర్తుచేస్తూ, రోడ్డుభద్రతపై నిర్లక్ష్యం ప్రాణాంతకమని హెచ్చరించారు.

# ఎస్.ఐ.ఆర్ వేగవంతం చేయాలి

- ఓటర్ల మ్యాపింగ్ ఇంటింటి పరిశీలన పూర్తి చేయాలి
- బిఎల్ఓ లు ఎన్నికల సంఘం ఆదేశాలను పాటించాలి
- మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి





మాట్లాడుతున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి8 ప్రభాతవార్త:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ – (ఎస్ఐఆర్) పై బూత్ లెవల్ అధికారులతో (బీఎల్‌వోలు) గురువారం జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశ మందిరంలో కలెక్టర్ విజయేందిర బోయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎస్ ఐఆర్ ఓటర్ల మ్యాపింగ్, ఇంటింటి పరిశీలన, ప్రోజెనీ (సంతతి) సర్వేలను రాబోయే రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని బీఎల్‌వోలను ఆదేశించారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల నియోజకవర్గాల్లోని పట్టణ ప్రాంతాల్లో బీఎల్‌వోల పనితీరు 25 శాతం కంటే తక్కువగా ఉందని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ ఓటర్ జాబితా మ్యాపింగ్ బీఎల్‌వోలు పక్కాగా ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పనిచేయాలని సూచించారు. గతంలో నమోదైన ఓటర్లు ప్రస్తుతం కొనసాగుతున్నారా లేదా, వారి వివరాలను గుర్తించి మ్యాపింగ్ చేయాలని ఆదేశించారు. ఈ మ్యాపింగ్ పనులు రాబోయే రెండు మూడు రోజుల్లో కనీసం 80శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అలాగే ప్రోజెనీ సర్వేను కూడా నిర్వహించి 75 శాతం పనిని రెండు మూడు రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈసందర్భంగామాట్లాడుతూ తెలంగాణలో త్వరలో నిర్వహించనున్న ఎస్ఐఆర్ కార్యక్రమానికి ఇది ప్రాథమిక సన్నాహక ప్రక్రియగా కలెక్టర్ వివరించారు. ఈ పనులు పూర్తయ్యితే అసలు ఎస్ఐఆర్ నిర్వహణ సమయంలో బీఎల్‌వోలపనిభారం తగ్గి,సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఎన్నికల సంఘానికి సంబంధించిన ఈ పనిని అత్యంత ప్రాధాన్యతను ఇచ్చి, బీఎల్‌వోలు రాబోయే రెండుమూడు రోజుల్లో 80శాతం మ్యాపింగ్ పూర్తిచేసేలా సంబంధిత సూపర్‌వైజర్లు,తహసీల్దార్లు,ఇతరసంబంధిత అధికారులుపర్యవేక్షణ చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూఅదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్, ఆర్డీఓ ఈ. నవీన్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.కృష్ణ, జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి షేక్ జరీనా బేగం,మహబూబ్‌నగర్అర్బన్ తహసీల్దార్, బూత్ లెవల్ అధికారులు పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో జిల్లా పౌరసరఫరాల అధికారి

### రూ. 50,000 లంచం తీసుకుంటూ పట్టుబడ్డ డీఎం జగన్మోహన్



ఏసీబీకి చిక్కిన డిఎం జగన్ మోహన్, డ్రైవర్ లక్ష్మణ్ నాయక్

**వనపర్తి క్రైమ్, జనవరి 8 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా పౌరసరఫరాల సంస్థ కార్యాలయంలో పని చేస్తున్న డీఎం జగన్మోహన్ గురువారం సాయంత్రం తన కార్యాలయం నుంచి ఇంటికి వెళుతూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో రూ.50 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డాడు. ఓ మిల్లుకు సీఎంఆర్ పర్మిషన్ ఇవ్వడానికి రూ. 1,70,000 ఒక లక్ష డెబ్బై వేల రూపాయలు డిమాండ్ చేశాడు. బాధితుడుతో రూ. 50 వేలకు బేరం కుదరడంతో ఒప్పందంలో భాగంగా గురువారం వనపర్తిలోని తన కార్యాలయం నుంచి ఇంటికి వెళ్తూ ఐడిఓసి కార్యాలయ ఆవరణలో తన కారులో రూ.50వేలు లంచం తీసుకుంటుండగా పక్కాసమాచారం మేరకు ఏసీబీ అధికారులు దాడి చేసి పట్టుకున్నట్లు ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ తెలిపారు. నిందితుడిని శుక్రవారం నాంపల్లి ఏసీబీ కోర్టులో ప్రవేశపెట్టనున్నట్లు ఏసీబీ డిఎస్పి తెలిపారు. పౌర సరఫరాల అధికారి జగన్మోహన్ ఏసీబీకి పట్టుబడ్డ తర్వాత ఐడిఓసి భవనం ముందు గుర్తుతెలియని వ్యక్తులు బాణాసంచా కాల్చి సంబరాలు జరుపుకోవడం కొసమెరుపు.



గుర్తుతెలియని వ్యక్తులు బాణాసంచా కాల్చుతూ సంబరాలు జరుపుకుంటున్న దృశ్యం

## వార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

**వనపర్తి ప్రతినిధి,జనవరి 8 ప్రభాతవార్త:** ప్రజలకు ప్రభుత్వానికి వారధిలా ఉంటూ సుదీర్ఘకాలం చరిత్ర కలిగినటువంటి తెలుగు జాతీయ దినపత్రిక వార్త 2026 క్యాలెండర్ వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి ఆవిష్కరించారు. గురువారం వనపర్తి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలోవార్త క్యాలెండర్‌ను ఆవిష్కరించి ఎమ్మెల్యే మాట్లాడారు. వార్త దినపత్రిక నిరంతరము పేదల పక్షాన పోరాటం చేస్తూ, వార్తలందిస్తుంటుందని కొనియాడారు.ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా ప్రతినిధి విజయ్ కుమార్, వనపర్తి కాన్స్టెన్సీ ఇంచార్జ్ .మన్యం, శ్రీరంగాపురం మండల రిపోర్టర్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



వార్త దినపత్రిక 2026 క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే

# నాగర్‌కర్నూల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

- నాగర్‌కర్నూల్‌లో రూ.1000 కోట్ల అభివృద్ధి
- విద్యా, వైద్యం, వ్యవసాయ రంగంపై దృష్టి
- తాడూరులో పాలిటెక్నిక్, నాగర్‌కర్నూల్‌లో ఐటిఐ కళాశాలలు
- మహిళా సాధికారతే లక్ష్యం
- నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ కూచకుల్ల రాజేష్‌రెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, జనవరి8 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యంగా అన్ని రంగాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి వివరించారు. నియోజకవర్గ అభివృద్ధి కోసం ఇప్పటివరకు 1000 కోట్ల నిధులతో అభివృద్ధి చేసిన ఘనత ప్రజా ప్రభుత్వానికి దక్కిందన్నారు.గురువారంఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో విద్య, వైద్యం, తాగు, సాగునీరు ఉపాధి అవకాశాలపై దృష్టిని కేంద్రీకరించడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని కనివిని ఎరుగని రీతిలో అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి అన్నారు.నాగర్‌కర్నూల్ పట్టణంలో రూ.55 కోట్లతో సిసిరోడ్లు డ్రైనేజీ వ్యవస్థను మెరుగుపరచడం కోసం నిధులను మంజూరు చేయడం జరిగిందన్నారు. ముస్లింల కోసం సాధికార నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలకు త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు. కొత్త బస్టాండ్ నిర్మాణం కోసం 12 కోట్ల రూపాయలు, అదేవిధంగా నాన్ వెజ్ మార్కెట్ ను టౌన్ హాల్ గా మార్చడం కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని త్వరలోనే అనుమతులు వస్తాయన్నారు. ఇప్పటివరకు రూ.45 కోట్ల పనులు పూర్తికాగా మరోరూ.20 కోట్ల రూపాయల నిధులు మంజూరైనట్లు ఆయన వివరించారు. పట్టణంలో అమృత్యాలు పథకం కింద రూ.36 కోట్ల రూపాయలు రచించి తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుందామన్నారు. ఎండబెట్ల వద్ద కేసరి సముద్రం చెరువు పైహై లెవెల్ బ్రిడ్జి నిర్మాణం కోసం పది కోట్లు నగరాభివృద్ధిపథకం కింద రూ.20కోట్ల రూపాయలను కేవలం మూడు రోజుల్లోనే మంజూరు చేయించడం జరిగిందన్నారు. రూ.68 లక్షలతో లిక్విడ్ ఆక్సిజన్ ప్లాంట్ మార్చురీ ఆధునీకీకరణ తదితరపనులను చేపట్టడానికి నిధులు మంజూరయ్యాయి అన్నారు. మెడికల్ కళాశాల వద్ద 650 పడకల ఆసుపత్రికి 206కోట్ల రూపాయలు మంజూరై టెండర్లు కూడా సిద్ధంగా ఉన్నాయన్నారు.వ్యవసాయ మార్కెట్ యార్డులో అభివృద్ధి కోసం రూ.9 కోట్ల రూపాయలు మహిళా శక్తి భవనానికి రూ.5 కోట్ల రూపాయలు,బాల భవనానికి కోటిన్నర నిధులు మంజూరు అయ్యాయన్నారు. రూ.13 కోట్ల 70 లక్షల వ్యయంతో ఎస్సీ కమిటీ భవనాల నిర్మాణం డ్రైనేజీ వ్యవస్థల నిర్మాణాల కోసం సబ్ ప్లాన్ నిధులను మంజూరు చేసి పనులు చేపట్టడం జరిగిందన్నారు.దుందుభి నదిపై సిర్సవాడ వద్ద బ్రిడ్జి నిర్మాణం కోసం 20కోట్ల20 లక్షల రూపాయలు మంజూరైనట్లు తెలిపారు. యంగ్ ఇండియా స్కూల్ నిర్మాణం కోసం నిధులు కూడా మంజూరయ్యాయని 200 కోట్లతో నిర్మించే ఈ భవనానికి టెండర్లు కూడా పూర్తయ్యాయని ఎమ్మెల్యే వివరించారు. పంచాయతీరాజ్ రోడ్ల మరమ్మతుల కోసం 25 కోట్ల రూపాయలు, కొత్త రోడ్ల కోసం 17 కోట్ల రూపాయలు కూడా మంజూరైనట్లు వివరించారు. పోతిరెడ్డిపల్లి, తెలకపల్లి, తోడుకుర్తి, ఉయ్యాలవాడ,నాగనూర్,పెద్ద ముద్దునూరు, ఇంద్రకల్ గ్రామాలలో నూతనంగా కోటి నలభై లక్షల రూపాయల వ్యయంతో పీహెచ్సీల సబ్ సెంటర్లు మంజూరు చేయడం జరిగిందన్నారు. నియోజకవర్గంలో 6 సబ్ స్టేషన్‌లకు -మిగతా4లో..

# నాణ్యమైన విద్యను అందించాలి

- నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే నెంబర్ వన్ చేయాలి
- మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే బాధ్యత ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులపై ఉందని మహబూబ్‌నగర్ శాసనసభ్యులు యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం మహబూబ్‌నగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన డైరీ ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యానిధి ద్వారా వీలైనంత సహకారం అందిస్తూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడానికి తాను నిరంతరం కృషి చేస్తున్నానని తెలిపారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ ఉపాధ్యాయులు, ముఖ్యంగా ప్రధానోపాధ్యాయులు పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించేందుకు మరింత కృషి చేయాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం విద్యను ప్రథమ లక్ష్యంగా పెట్టుకుని అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని, వాటిని పాఠశాల స్థాయిలో విద్యార్థులకు సమర్థవంతంగా అందించాల్సిన బాధ్యత ప్రతిఉపాధ్యాయుడిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్, టీఎస్ జిహెచ్ఎంఏ జిల్లా అధ్యక్షులు అనంతప్ప, ప్రధాన కార్యదర్శి జగదీష్ కుమార్, ట్రెజరర్ అబ్దుల్ హక్, గౌరవాధ్యక్షులు బాలు యాదవ్, మండల విద్యాధికారులు మంజులాదేవి, నాగేంద్రమ్మ, సుధాకర్, బలరాం, ఇబ్రహీం మిన్హాజ్, శ్రీనివాసులు తదితర నాయకులు పాల్గొన్నారు.



డైరీని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే యెన్నం, చిత్రంలో డిఇఓ ప్రవీణ్ కుమార్

# డ్రంక్ అండ్ డ్రైవ్ నేరంతో సమానం

- రోడ్డు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోతున్నది యువకులే
- మహబూబ్‌నగర్ జిల్లా ఎస్పీ డి.జానకి
- జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల పోస్టర్ ఆవిష్కరణ, పాల్గొన్న అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎస్పీ జానకి చిత్రంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

**మహబూబ్‌నగర్ బ్యూరో, జనవరి 8 ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా యువత ప్రాణాలు కోల్పోతున్నారని, ఇది సమాజానికి తీరని నష్టమని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి ధరావత్ ఆవేదన వ్యక్తం చేశారు. జాతీయరోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా గురువారం మహబూబ్ నగర్ జిల్లా క్రీడా మైదానంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డి.జానకి తో పాటు అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ జానకి ప్రజలనుద్దేశించి విస్తృతంగా మాట్లాడుతూ రోడ్డు భద్రత అనేది కేవలం ట్రాఫిక్ నిబంధనల విషయం మాత్రమే కాదని,అది ప్రతి కుటుంబం భవిష్యత్తుతో ముడిపడి ఉన్న అంశమని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, హెల్మెట్ ప్రాణ రక్షణ కవచమని తెలిపారు. అలాగే నాలుగు చక్రాల వాహనదారులు సీట్ బెల్ట్ ధరించడం ద్వారా ప్రమాద తీవ్రతను తగ్గించుకోవచ్చని వివరించారు. ట్రిబుల్ రైడింగ్ చేయడం వల్ల ప్రమాదాల అవకాశాలు రెట్టింపు అవుతాయని, మద్యం సేవించి వాహనాలు నడపడం (డ్రంక్ అండ్ డ్రైవ్) అనేది నేరంతో సమానమని హెచ్చరించారు.జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాలు నిర్వహించడం వెనుక ప్రధాన ఉద్దేశ్యం ప్రజల్లో చైతన్యం తీసుకురావడమేనని జిల్లా ఎస్పీ తెలిపారు. పోలీసులు చర్యలు తీసుకోవడం కన్నా ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలు పాటించడమే నిజమైన విజయం అని ఆమె పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించి, తమ కుటుంబాల ఆనందాన్ని కాపాడుకోవాలని, అలాగే ఇతరుల ప్రాణ భద్రతకు కూడా బాధ్యతగా వ్యవహరించాలని జిల్లా ఎస్పీ ప్రజలకు హృదయ పూర్వకంగా విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం ద్వారా రోడ్డు ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించడమే లక్ష్యమని జిల్లా ఎస్పీ తెలిపారు. అనంతరం రోడ్ సేఫ్టీ పోస్టర్లను విడుదల చేసి, ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో డిఎం అండ్‌హెచ్ఓ కృష్ణా, డివైఎస్ఓ శ్రీనివాస్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ బెక్కరి అనితారెడ్డి, టూ టౌన్ ఇన్స్పెక్టర్ ఇజాజుద్దీన్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ భగవంత్ రెడ్డి, విద్యార్థులు, యువకులు పాల్గొన్నారు.

# సమావేశాల పేరిట ప్రచారాలు

- ప్రచారాల్లో ఒకరిపైనొకరు విమర్శనాస్త్రాలు
- మున్సిపాలిటీ ఎన్నికలకు పార్టీల పరోక్ష ప్రచారాలు షురూ

-వివరాలు 2లో..

## డా.బి.ఆర్ అంబేద్కర్ అసోసియేషన్ క్రికెట్ టోర్నమెంట్ ఘన ప్రారంభం

**మద్దూరు, జనవరి 8 ప్రభాతవార్త :** మద్దూరు మండల కేంద్రంలో డా. బి.ఆర్ అంబేద్కర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్‌ను మార్కెట్ కమిటీ చైర్మన్ ముద్ది భీములు, మాజీ పీఏసీఎస్ చైర్మన్ గుళ్ల నర్సింహులు, రామ్ రెడ్డి సార్‌లు ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా అతిథులు మాట్లాడుతూ యువత క్రీడల వైపు మరింత ఆసక్తి చూపడం సమాజానికి శుభ సూచకమని పేర్కొన్నారు. క్రీడలద్వారా క్రమశిక్షణ, సహనశీలత, స్నేహభావం పెరుగుతాయని తెలిపారు. ఇలాంటి టోర్నమెంట్‌లు యువతలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీసి, భవిష్యత్ క్రీడాకారులను తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషిస్తాయని అభిప్రాయపడ్డారు. గ్రామీణస్థాయిలో క్రీడలను ప్రోత్సహించడమే లక్ష్యంగా ఈ టోర్నమెంట్‌ను నిర్వహించడం అభినందనీయమని, యువత చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీరేష్ గౌడ్, మల్లికార్జున్, రఘుపతి రెడ్డి, రమేష్ రెడ్డి, జంగం బాబు, ముద్ది సుభాష్, నరసిం హులు గౌడ్, పల్లెగడ్డ వెంకట్, పింజారి ఉషన్, జీడి ప్రకాష్, రహీం, అశోక్ గౌడ్, డా.బి.ఆర్‌అంబేద్కర్ అసోసియేషన్ సభ్యులు, క్రీడాకారులు, యువకులు, క్రీడాభిమానులు తదితరులు పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నాయకులు

## ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు నోటుబుక్స్, పెన్నులు వితరణ

**శ్రీరంగాపూర్, జనవరి 8 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని కం బాలపురం గ్రామంలో బుధవారం వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డి పుట్టినరోజు సందర్భంగా కం బాలపురంలోని ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు నోటు పుస్తకాలు పెన్నులు కాంగ్రెస్ నాయకులు వితరణ చేయడం జరిగింది. కాంగ్రెస్ నాయకులు విద్యార్థిని, విద్యార్థులు వనపర్తి ఎమ్మెల్యే తూడి మెగారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఇలాంటి పుట్టినరోజులు మరెన్నో జరుపుకొని ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బుడ్డయ్య పుల్లారెడ్డి వార్డు సభ్యులు కృష్ణయ్య నాయక్, రాజ్ కుమార్ యాదవ్, మౌనిక, ఎల్లస్వామి, శ్యాంసుందర్ రెడ్డి, కురుమయ్య, వీరయ్య, కొండయ్య, వెంకటయ్య, దక్యా నాయక్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొనడం జరిగింది.


విద్యార్థులకు నోట్‌బుక్కులు అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

## వార్డుల్లో ఓటర్ల మార్పులు,చేర్పులు

**చేర్పుల పట్ల నేతల్లో అసహనం**

**భూత్పూర్,జనవరి 8,ప్రభాతవార్త :** భూత్పూర్ మున్సిపాలిటీలో ఓటర్ల మార్పులు,చేర్పుల పట్ల పలుపార్టీల నేతల్లో గందర గోళమేర్పడింది.కొత్త ఓటర్ల చేర్పులపై పలువురు అభ్యంతరాలతో పాటు పలువురు నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.తాజాగా భూత్పూర్ మున్సిపాలిటీ రూపొందిన ఓటర్ల ముసాయిదా జాబితాను పరిశీలిస్తే భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీలోని మొత్తం పదివార్డుల ఓటర్లు 12064మంది ఓటర్లున్నారు.వీరిలో 5975మంది పురుష ఓటర్లుకాగా,6089మంది మహిళా ఓటర్లు ఉన్నారు.

**అసెంబ్లీ ఎన్నికల జాబితా ప్రకారమే మున్సిపాలిటీ ఓటర్ల జాబితా**
**మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్**

గడిచిన అసెంబ్లీ ఎన్నికల ఓటర్ల జాబితానుసరించి మున్సిపాలిటీ ఓటరు జాబితాను రూపొందించినట్టు మున్సిపల్ కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.మున్సిపాలిటీలో కొత్త ఓటర్లు ఎవరూ లేరని,కొంతమంది ఒకవార్డు నుంచి వేరొక వార్డుకు బదిలీ కోసం అభ్యర్థనలు చేసినట్లు తెలిపారు.ఒకటో వార్డు నుంచి బదిలీచేయమని 28మంది,రెండో వార్డు నుంచి 12మంది,నాల్గో వార్డు నుంచి బదిలీ చేయమని 13మంది,5వ వార్డు నుంచి బదిలీ చేయమని 5గురు,8వ వార్డు నుంచి 26మంది ఓటర్లు, 9వవార్డు నుంచి ఒకరు, 10వ వార్డు నుంచి ముగ్గురు మొత్తం 88మంది ఓటర్లు వివిధ వార్డులకు బదిలీ చేయమని ధర ఖాస్తులు చేసుకున్నట్లు కమిష నర్ తెలిపారు.వీరి అభ్యర్థనల్ని క్షుణ్ణంగా పరిశీలించి,అన్ని రకాల అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని తుది జాబితాను రూపొందిస్తామని కమిషనర్ నూరుల్ నజీబ్ తెలిపారు.

## రోడ్డు భద్రత పై విద్యార్థులకు అవగాహన

**అడ్డాకుల, జనవరి 8 ప్రభాతవార్త :** 37వ జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు సందర్భంగా గురువారం పీఎం శ్రీ ఉన్నత పాఠశాలలో శాఖాపూర్ టోల్ ప్లాజా వారు విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మహబూబ్ నగర్ రవాణా శాఖ అసిస్టెంట్ మోటార్ వాహన ఇన్‌స్పెక్టర్ ప్రవీన్ కుమార్, అడ్డాకుల ఎస్సై శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ రహదారి భద్రత నియమ నిబంధనలు పాటించాలని, హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడుపరాదని, సెల్ ఫోన్ ఉపయోగించి వాహనాలు నడుపరాదని, అతివేగంతో ప్రయాణించవద్దని, అధిక లోడ్ వేయవద్దని సూచించారు. రాంగ్ రూట్ లో ప్రయాణం చేయరాదని కోరారు. ప్రతిజ్ఞ చేయించి, రోడ్డు భద్రతా కరపత్రాలు విద్యార్థులకు అందజేశారు. అనంతరం ప్రమాదాలకు సంభందించిన వీడియోలు ప్రొజెక్టర్ ద్వారా చూపించారు. ఈ కార్య క్రమంలో ఎంఈఓ ప్రకాష్ , ప్రధానోపాధ్యాయురాలు జ్యోతి, సేఫ్టీ ఇంచార్జీ రఘునందన్ గౌడ్, షిఫ్ట్ ఇంచార్జ్ సురేందర్ రెడ్డి, రూట్ సిబ్బంది, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.


విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

## ధాన్యం కొనుగోలు తీరుపై రైతుల నిరసన

**ఉప్పునుంతల,జనవరి 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని మొల్గర వద్ద ఐకెపి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు తీరు పై ఆ గ్రామ రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. అధికారులు వరి కొనుగోలులో క్రమపద్ధతి పాటించకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండల టీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీంద్రరావు ఆరోపించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు కేంద్రాల వద్ద రైతులతో కలిసి ఆయన నిరసన తెలిపారు. ఐకెపి అధికారులు కొంతమంది రైతుల ధాన్యం వారు ఆరబెట్టిన ప్రాంతానికి వెళ్లి కొనుగోలు చేస్తున్న ట్లు పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కొనుగోలు కేంద్రాల వద్దకు తీసుకువచ్చిన రైతుల ధాన్యా న్ని ఏలాంటి ఇబ్బందులకు గురి చేయకుండా కొనుగోలు చేయాలని వారు కోరారు. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, వరి రైతులకు న్యాయం జరిగేలా క్రమపద్ధతిని పాటిస్తూ ధాన్యం కొనుగోలు చేయాలని రవీంద్రరావు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో లక్ష్మాపూర్ సర్పంచ్ గోపాల్, మొల్గర ఉప సర్పంచ్ రమేష్, సుమన్ రెడ్డి, ఎల్లా గౌడ్, వార్డు సభ్యులు ఖాజా పవన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


మొల్గర వరి ధాన్యం కొనుగోలు కేంద్రం వద్ద ఆందోళన చేపడుతున్న రైతులు

## దేవాలయ నిర్మాణానికి విరాళం

**వెల్దండ, జనవరి 8 ప్రభాతవార్త:** మండలంలోని చెర్కూర్ గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ శివాలయ ఆంజనేయస్వామి దేవాలయం నిర్మాణానికి గ్రామ సర్పంచ్ బచ్చల కుర శ్రీనివాసులు రూ.51 వేల రూపాయల విరాళాన్ని ఆలయ కమిటీ సభ్యులకు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు, ఆలయ కమిటీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ కొండల్, మైసయ్య, భీమయ్యగౌడ్, యాదయ్య గౌడ్, శంకర్, సందీప్, మొగులయ్య, లాలయ్య, రమేష్, బాలయ్య, జంగయ్యతో పాటు తదితరులున్నారు.


ఆలయ నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

# సమావేశాల పేరిట ప్రచారాలు

**- ప్రచారాల్లో ఒకరిపైనొకరు విమర్శనాస్త్రాలు**

**- మున్సిపాలిటీ ఎన్నికలకు పార్టీల పరోక్ష ప్రచారాలు షురూ**

**భూత్పూర్,జనవరి 8,ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికలలో భాగంగా జీపీ ఎన్నికలు ముగిసిన తర్వాత ఆయా పార్టీలు, అధికారుల దృష్టి మున్సిపాలిటీలపై పడింది.వారం పది రోజుల్లో మున్సిపాలిటీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడనుందన్న ఊహాగానాల నేపథ్యంలో ఆయా పార్టీలు అలర్ట్ అయ్యాయి.అప్పుడే ఆయా వార్డులలో పరోక్ష ప్రచారాలకు శ్రీకారం చుట్టాయి. కార్యకర్తల సమావేశాల పేరిట మున్సిపల్ వార్డులలో ప్రత్యేక సమావేశాలేర్పాటు చేసి ఎన్నికల ప్రచారాలకు తెర లేపారు. భూత్పూర్ మున్సిపాలిటీలోని పదివార్డులలో సమావేశాల ద్వారా నాయకులు,కార్యకర్తల్ని ఉత్తేజపరిచి పరోక్ష ప్రచారాలకు వారిని కార్యోన్ముఖుల్ని చేస్తున్నారు. ముఖ్యంగా కాంగ్రెస్,బీఆర్ఎస్ పార్టీలు వార్డుల్లో విస్తృత ప్రచారాలు నిర్వహిస్తున్నారు. జీపీల ఎన్నికల ఫలితాల్ని బేరీజు వేసుకుంటూ మున్సిపాలిటీలలో పాగా వేసేందుకు ఆయా పార్టీ నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు.భూత్పూర్ మున్సిపాలిటీలోని పదివార్డులలో గడిచిన వారం రోజులుగా ఎడతెరిపిలేకుండా ప్రచారాలకు శ్రీకారం చుట్టారు.మార్నింగ్ వాక్ అని కొందరంటే సమీక్షలంటూ మరికొందరంటూ సమావేశాలకు కొత్తపేర్లు పెట్టి విస్తృత స్థాయి ప్రచారాలు నిర్వహిస్తున్నారు.ప్రచారాల్లో ఒకరిపై ఒకరు వ్యక్తిగత ఆరోపణలు,దూషణలకు,దుమ్మెత్తి పోసుకోవడాలు వంటివి తమ ప్రచారాల్లో జోడిస్తున్నారు.పదేండ్లలో బీఆర్ఎస్ ప్రజలకు ఒరగబెట్టిందేమి లేదని కాంగ్రెస్ అధికారం చేపట్టిన రెండేళ్లలో గణనీయ ప్రగతిని సాధించిందని సమావేశాల్లో కాంగ్రెస్ నేతలు పేర్కొంటుంటే,రెండేళ్లలో ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా,అమలుకు నోచని కొత్తపథకాలు తీసుకువచ్చి,ఉన్న పథకాలకు తిలోధకాలిచ్చారని బీఆర్ఎస్ నేతలు తమ సమావేశాల్లో ప్రధానాస్త్రాలుగా ఉపయోగిస్తున్నారు.ఇక మున్సిపాలిటీలో ఎలాగైనా స్థానాలు దక్కించుకోవాలని బీజేపీ తన వంతు ప్రయత్నాలు చేస్తోంది.చాపకింద నీరులా పట్టణ వార్డుల్లో పరోక్ష ప్రచారాలు చేస్తున్నారు.మున్సిపల్ చైర్మన్ పదవి కోసం ప్రస్తుతం అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి పార్టీ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ విస్తృత ప్రచారాలకు శ్రీకారం చుడుతుంటే, ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నుంచి పార్టీ సీనియర్ నేత టి మురళిధర్‌గౌడ్(టీఎంగౌడ్) తమ పార్టీ అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌తో పాటు సీనియర్ నాయకులతో కలిసి వార్డుల్లో విస్తృతంగా ప్రచారాలు నిర్వహిస్తున్నారు.ఇక బీజేపీ నుంచి చైర్మన్ టికెట్టునాశిస్తున్న కెంద్యాల శ్రీనివాస్(ఐదిండ్ల శ్రీను) తాను ప్రాతినిత్యం వహించే వార్డుల్లో విస్తృతంగా పర్యటిస్తూ పరోక్ష ప్రచారాలు చేస్తున్నారు.అధికారులు ఇప్పటికే మున్సిపాలిటీలోని వార్డులకు సంబంధించి ఓటర్ల జాబితా సిద్ధం చేస్తుండడంతో మున్సిపాలిటీ ఎన్నికలు త్వరలో జరుగుతాయనే ఊహాగానాలకు తెరదించినట్లవుతోంది.


ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్

## మత్స్యకారుల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**అమరచింత జనవరి 8, ప్రభాతవార్త:** మత్స్యకారుల అభ్యున్నత కోసమే రాష్ట్ర ప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షులు కేజీ మహేందర్ రెడ్డి, అమరచింత పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు, అరుణ్ కుమార్ అన్నారు. గురువారం అమరచింత మండలంలోని జూరాల ప్రాజెక్టు జలాశయంలో ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు.ఈసందర్భంగా వారు మాట్లాడుతూ,మత్స్యకారులు ఆర్థికంగా ఎదగాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పూర్తి రాయితీ ఉచిత చేప పిల్లలను జూరాల జలాశయంలో వదిలేమని వారు తెలిపారు.అలాగే రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుము ల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి మత్స్యకారుల సంక్షేమానికి అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మత్స్యశాఖ అధికారి, లక్ష్మప్ప, నందిమల్ల గ్రామ సర్పంచ్ రాజేందర్ రెడ్డి, మిట్ట నంది మల్ల సర్పంచ్, వడ్డే శ్రీనివాసులు, ఈర్లదిన్నె గ్రామ సర్పంచ్ చుక్క వెంకటమ్మ, నందిమల్ల ఎక్స్ రోడ్డు ఉప సర్పంచ్ భాస్కర్ రెడ్డి, ఆత్మకూ రు మార్కెట్ డైరెక్టర్లు విష్ణు, శ్యాం కుమార్, కాంగ్రెస్ నాయకులు చుక్క ఆసి రెడ్డి, సర్వ రెడ్డి, వెంకట్ రెడ్డి, మత్స్యకారుల సంఘం అధ్య క్షులు ఆశన్న, రాములు, నర్సింలు, కుమ్మరి వెంకటేష్, శ్రీనివాస్ రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, బాల్‌రాజ్, మద్దిలేటి, బండి శ్రీధర్, రాకేష్ గౌడ్, వీరేష్ గౌడ్, నరేష్ యాదవ్, ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


జూరాల జలాశయంలో చేపల పిల్లలను వదులుతున్న కాంగ్రెస్ నాయకులు

## సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా : దాసర్లపల్లి సర్పంచ్

**ఉప్పునుంతల,జనవరి 8 ప్రభాతవార్త :** గ్రామంలో నెలకొన్న సమస్యలను పరిష్కరించడానికి కృషిచేస్తానని దాసర్లపల్లి సర్పంచ్ బోధనపల్లి రమేష్‌రెడ్డి అన్నారు.గురువారం గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామసర్పంచ్ రమేష్‌రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు.ఈ సందర్భంగా గ్రామాభివృద్ధికి సంబంధించి పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో ప్రమాదంగా ఉన్న 11 కెవి విద్యుత్తు లైన్ తొలగించడం,పారిశుద్ధ్య పనులు,పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించే విధంగా కృషి చేస్తానని అన్నారు. గ్రామాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని, రాజకీయాలకు అధికంగా గ్రామాభివృద్ధికి పాటుపడతానని గ్రామసభలో పేర్కొన్నారు. ఈ గ్రామసభలో సర్పంచ్ బోధన పల్లి రమేష్ రెడ్డి, ఉప సర్పంచ్ పానుగంటి శంకర్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి పవన్ ,గ్రామస్తులు పాల్గొన్నారు. మామిళ్ళపల్లిలో విద్యుత్ స్తంభాలు, వీధి దీపాలు ఏర్పాటు మండలంలోని మామిళ్ళపల్లి గ్రామంలో విద్యుత్తు స్తంభాలు, వీధి దీపాల ఏర్పాటు కృషిచేస్తానని సర్పంచు మొకురాల మోహన్‌గౌడ్ అన్నారు.గురువారం గ్రామంలో విద్యుత్ స్తంభాలు కావలసిన ప్రాంతాలు, గ్రామాలలో ఏర్పాటు చేసేందుకు సర్వే నిర్వహించారు. అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ సహకారంతో గ్రామంలో విద్యుత్తు స్తంభాలు ఏర్పాటు చేస్తానని, అదేవిధంగా గతకొన్ని రోజుల నుంచి విద్యుత్ దీపాలు లేక అంధకారంలో ఉన్న మామిళ్ళపల్లి గ్రామంలో వెలుగు నింపేందుకు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నట్లు సర్పంచ్ మొకురాల మోహన్ గౌడ్ పేర్కొన్నారు.



దాసర్లపల్లిలో జరిగిన గ్రామసభలో పాల్గొన్న పాలక మండలి

## బేడ బుడగ జంగాల సంక్షేమానికి కృషి చేస్తా : జంగం రవి

**చిన్నచింతకుంట, జనవరి 8 ప్రభాతవార్త :** బేడ బుడగ జంగాల సంక్షేమానికై అన్ని విధాల కృషి చేస్తానని బేడ బుడగ జంగాల హక్కుల పోరాట సమితి నియోజకవర్గ అధ్యక్షులు జంగం రవి అన్నారు. గురువారం శ్రీ కురుమూర్తి స్వామి దేవస్థానం ప్రాంగణంలో నూతన కమిటీ సభ్యులతో మొదటి సమావేశాన్ని నిర్వహించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉందని స్థానిక ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి కి మద్దతుగా నిలిచి ఈ ప్రభుత్వంలో నిరుపేదలైన బుడగ జంగాలలో అర్హులైన సంక్షేమ ఫలాలు అందించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వెళ్తానని ఆయన తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని మండలాలలోని బుడగ జంగాలు కలిసికట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వానికి మద్దతుగా నిలబడాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిరువాటి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి రాచూరి చంద్రమౌళి, నాయకులు రాచూరి శ్రీను, సిరిగిరి శ్రీను, వెంకటేష్, పరశురాం, మహేందర్, కురుమన్న,బాబు తదితరులు పాల్గొన్నారు.


బేడ బుడగ జంగాల నూతన కమిటీ సభ్యులతో సమావేశం

**దేవరకద్ర నియోజకవర్గం అధ్యక్షులు జంగం రవి ఆధ్వరంలో నూతన కమిటీతో సమావేశం...**

దేవరకద్ర నియోజకవర్గం బేడ బుడగ జంగాల మండల అధ్యక్షులు పొన్నకంటి శ్రీనివాస్, గగనం శంకర్, సిరివాటి తిరుపతయ్య సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జంగం రవి మాట్లాడుతూ దేవరకద్ర నియోజకవర్గం బేడ బుడగ జంగాల దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి మనకు ఏ ఆపద వచ్చినా కూడా మన ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మన జంగాలకు న్యాయం చేయగలుగుతానని, కాంగ్రెస్ పార్టీ తరపున వచ్చే పథకాలు కూడా ప్రతి ఇంటికి చేరేట్లుగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గౌరవ అధ్యక్షులు సిరువాటి శ్రీనివాసులు, మాజీ జడ్పిటిసి రాచూరి చంద్రమౌళి, రాచూరి శీను, సిరిగిరి శీను, వెంకటేష్, పరుశురాం, మహేందర్, కురుమన్న, బాబు తదితరులు పాల్గొన్నారు.

## రుద్రారంలో సంక్రాంతి సంబరాల ప్రీమియర్ లీగ్ టోర్నమెంట్

**వాలీబాల్ క్రికెట్ ముగ్గుల పోటీలు నిర్వహించనున్న సర్పంచ్**

**నవాబుపేట జనవరి 8 ప్రభాతవార్త :** నూతన సంవత్సర,సంక్రాంతి పండగల సందర్భంగా రుద్రారం ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంటును గురువారం సర్పంచ్ రవీందర్ గ్రామ ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో గ్రామస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను సర్పంచ్ రవి సొంత నిధులతో గ్రామ యువకుల కోరిక మేరకు ప్రారంభించారు. టోర్నమెంట్లో మొదటి బహుమతికి రూ.10 వేల నగదు, ద్వితీయ బహుమతి, రూ.5 వేల నగదును సర్పంచ్ రవి అందజేయనున్నారు. అనంతరం వాలీబాల్ టోర్నమెంట్,స్త్రీలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు కూడా ఈనెల 14 తారీకు వరకు నిర్వహించి బహుమతులు గ్రామస్తులు ప్రజా ప్రతినిధుల ఆధ్వర్యంలో ప్రధానం చేయనున్నామని ఈ సందర్భంగా సర్పంచ్ రవీందర్ తెలియజేశారు. మొత్తం క్రికెట్ జట్లు 7 ఉండగా వాలీబాల్ 4 నుంచి 5 టీముల వరకు ఉంటాయని కేవలం రుద్రారం గ్రామ యువకుల కోసం నిర్వహించిన ఈ ఆర్‌పిఎల్ క్రికెట్ టోర్నమెంటు గ్రామ యువకులకు మానసిక ఉల్లాసానికి, పండగ సందర్భంగా అందరూ ఒకే చోట కలుసుకొని సరదాగా గడపడానికి శారీరక మానసికోల్లాసానికి ఆటలు దోహదపడతాయని ఈ సందర్భంగా ఆర్పిఎల్ ఆర్గనైజర్స్ తెలియజేశారు. పిఎసిఎస్ డైరెక్టర్ మధుసూదన్, మాజీ సర్పంచ్ యాదయ్య గౌడ్, సీనియర్ నాయకులు కృష్ణ గౌడ్, సంద మల్లేష్, కురువ నరసింహులు, రవీందర్ గౌడ్ గ్రామ ప్రజా ప్రతినిధులు ఉన్నారు.

## ఆయకట్టు రైతులకు సాగునీరు విడుదల


అమరచింత ఆయకట్టు దారులకు సాగునీరు విడుదల

**అమరచింత జనవరి 8, ప్రభాతవార్త:** అమరచింత పెద్ద చెరువు ఆయకట్టు దారులకు గురువారం పెద్ద చెరువు దగ్గర ప్రత్యేక పూజలు నిర్వహించి సాగునీరు విడుదల చేశారు. ఈ సందర్భంగా అమరచింత పెద్ద చెరువు సంఘం అధ్యక్షులు, పోసిరి గారి విష్ణు మాట్లాడుతూ, రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రివర్యులు, డాక్టర్ వాకిటి శ్రీహరి ఆదేశాల మేరకు చెరువు ఆయకట్టుదారులకు సాగునీరు విడుదల చేశామని ఆయన తెలిపారు. రైతులు ఎలాంటి రాగద్వేషాలకు వెళ్లకుండా నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన రైతులను కోరారు. రైతు సంక్షేమానికి రాష్ట్రప్రభుత్వం ఎనలేని కృషి చేస్తుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షులు అరుణ్ కుమార్, మాజీ ఎంపీటీసీలు, మహంకాళి విష్ణు, తిరుమలేష్, రైతులు వెంకట్ రెడ్డి, జింక రవి, నరసింహారెడ్డి, హనుమంతు నాయక్, అల్తాఫ్, ఏఈ ఆంజనేయులు, వర్క్ ఇన్స్పెక్టర్ డి సి దామోదర్ తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సుకు జానంపేట విద్యార్థిని

**శ్రీరంగాపూర్, జనవరి 8 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండలంలోని జానంపేట గ్రామానికి చెందిన ఇక్రా భాను పెబ్బేరు మండల కేంద్రంలోని ఉర్దూ మీడియం 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని రాష్ట్రస్థాయి వైజ్ఞానిక సదస్సు కామారెడ్డిలో మూడు రోజులపాటు జరుగుతున్న సదస్సులు పాల్గొనడం జరిగింది. రాష్ట్రస్థాయిలో ప్రతిభ కనపరుస్తూ ఎంతోమందికి మార్గదర్శకంగా అయిన విద్యార్థిని ఇక్రబానును ఉర్దూ మీడియం ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, తల్లిదండ్రులు, బంధుమిత్రులు శానంపేట వాసులు సంతోషం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది.


విద్యార్థినిని అభినందిస్తున్న దృశ్యం

## ఘనంగా ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలు

**నాగరాల సర్పంచ్ గుంటి మహదేవ్**

**శ్రీరంగాపూర్,జనవరి8 ప్రభాతవార్త:** శ్రీరంగపురం మండలంలోని నగరాల గ్రామంలో వనపర్తి ఎమ్మెల్యే తుడిమేఘారెడ్డి జన్మదిన వేడుకలను నగరాల గ్రామ సర్పంచ్ గుంటి మహదేవ్, శ్రీరంగాపూర్ మండల ఉపాధ్యక్షులు ఆర్.నరేందర్ రెడ్డి ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి విద్యార్థులకు నోట్ బుక్స్ పెన్నులను వితరణ చేసి కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ నాయకులు గ్రామ ప్రజలు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నగరాల కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షులు కోమరి ఆంజనేయులు, ఉపసర్పంచ్ కురుమయ్య, వార్డు మెంబర్లు, గ్రామ పెద్దలు, ఆడపడుచులు, యువకులు పాల్గొన్నారు.

## లాంగ్ జంప్ అథ్లెటిక్ రాష్ట్రస్థాయికి అడ్డాకుల విద్యార్థి

**అడ్డాకుల, జనవరి 8 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో పిఎం శ్రీ ఉన్నత పాఠశాలల 6, 7న జరిగిన జిల్లా స్థాయి టోర్నమెంట్ పోటీలలో అడ్డాకుల పిఎం శ్రీ పాఠశాలకు ప్రథమ స్థానం దక్కించుకొని రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారు. లాంగ్ జంప్ అథ్లెటిక్ విభాగంలో పి.సందీప్ మొదటి స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు పిడి మంజుల తెలిపారు. షార్ట్ పుట్ విభాగంలో యశ్వంత్ మూడవ స్థానం దక్కించుకున్నారు. ప్రధాన ఉపాధ్యాయురాలు జ్యోతి, ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.


ఎంపికైన సందీప్

# మహిళలపై వేధింపులు జరిగితే పోక్సో యాక్టు ప్రకారం చర్యలు

**పోక్సో యాక్టు పై మహిళలతో పాటు పురుషులకు అవగాహన కల్పించాలి**

**జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ వి. రజని**

**వనపర్తి, జనవరి 8 ప్రభాతవార్త:** పని చేసే చోట మహిళలకు వేధింపులకు గురి చేస్తే చట్టపరమైన చర్యలు ఉంటాయని, మహిళలకు ఎక్కడైనా వేధింపులు ఉంటే నిర్భయంగా లోకల్ కంప్లయింట్ కమిటీ లో ఫిర్యాదు చేయాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ రజని సూచించారు.వనపర్తి జిల్లా ఐడిఓసి సమావేశ మందిరంలో గురువారం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో లోకల్ కంప్లయింట్ కమిటీ సమావేశం నిర్వహించారు. పురుషులతో సమానంగా మహిళలు పని చేసుకునే విధంగా మహిళా రక్షణ చట్టాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశాల మేరకు ఇప్పటికే అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పని చేసే మహిళలను లైంగిక వేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేసేందుకు ఇంటర్నల్ కంప్లయింట్ కమిటీలు, ఆపై జిల్లా స్థాయిలో లోకల్ కంప్లయింట్ కమిటీని ఏర్పాటు చేసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ మాట్లాడుతూ పని ప్రదేశంలో అది ప్రభుత్వ కార్యాలయాలు అయిన ప్రైవేట్ సంస్థల్లో లేదా ఇళ్లలో అయిన సరే మహిళలపై లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు ఉంటాయని అన్నారు.మహిళలపై శారీరిక, మానసిక వేధింపులకు పాల్పడితే బాధ్యులపై చట్ట పరంగా తగిన శిక్షలు ఉంటాయని యాక్ట గురించి మహిళా ఉద్యోగులకు అవగాహన కల్పించారు. బాధితులు 90 రోజుల్లో ఇంటర్నల్ కమిటీకి లేదా షి బాక్స్ పోర్టల్ ద్వారా ఆన్లైన్ లో ఫిర్యాదు చేయవచ్చని సూచించారు. మహిళల రక్షణ చట్టాలు, లైంగిక వేధింపుల విధానాలు, చట్టం ద్వారా మహిళలకు రక్షణపై అవగాహన కల్పించారు. సమావేశంలో పాల్గొన్న డీఎస్పీ బాలాజీ నాయక్ మాట్లాడుతూ జిల్లాలో 64 శాఖల్లో ఇంటర్నల్ కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, లోకల్ కమిటీ సైతం ఏర్పాటు చేసి ఉన్నందున మహిళలు పనిచేసే చోట లైంగిక వేధింపులకు గురి అయితే సంకోచించకుండా ఫిర్యాదు చేయాలని సూచించారు. బాధ్యులను విచారించి ఆరోపణ నిర్ధారణ అయితే సెక్షన్ 74 ప్రకారం శిక్షలు ఉంటాయని చెప్పారు. మహిళల కోసం ఉద్దేశించిన చట్టాలపై ప్రతిఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. ఈ సమావేశంలో జిల్లా సంక్షేమ అధికారి సుధారాణి, లోకల్ కమిటీ సభ్యులు డా. శ్రీలేఖ, జిసిడిఓ సుబ్బలక్ష్మి, శ్రీదేవి, రూరల్ డెవలప్మెంట్ సొసైటీ ప్రెసిడెంట్ చిన్నమ్మ థామస్, డిసిపిఓ రాంబాబు, మహిళా ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ రజని

## ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలకు గిరిజనుల సన్మానం

**బిజినేపల్లి, జనవరి 8 ప్రభతవార్త:** దశాబ్దాల కాలంగా ఎదురుచూసిన గిరిజనుల కళను నిజం చేసిన ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి, ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డిలను గురువారం గిరిజన సంఘాల నాయకులు,సర్పంచులు సన్మానించారు. గిరిజన లంబాడ జాతికి తాముున్నామంటూ ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే సంత్ సేవాలాల్ మహారాజ్ భవన నిర్మాణానికి మూడు కోట్ల రూపాయలు విడుదల చేయడం శుభ పరిణామం అన్నారు. గిరిజన తండాల అభివృద్ధి కోసం మౌలిక సదుపాయాలతో పాటు రోడ్లు , గ్రామపంచాయతీ నూతన భవనాలు, నిర్మించి అభివృద్ధికి తోడ్పాటును అందిస్తున్నారని చెప్పారు. అనంతరం ఎమ్మెల్సీ ఎమ్మెల్యేలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గిరిజన లంబాడీ సర్పంచులు కేతావత్ సరోజ మాన్య నాయక్, మునీందర్, గోపాల్ నాయక్,గోరి భాయి, ఆర్.గోపాల్, కృష్ణ , కాట్రావత్ బుజ్జిచందు లాల్, లలిత భాయి, రాట్లవత్ విజయ దిప్ల , పూల్య నాయక్, రామచందర్, నాయకులు మూడవత్ గోవింద్ నాయక్, మూడవత్ హన్మ్య, ఆంగోత్ లక్ష్మణ్, పాండు బదావత్ పాండు నాయక్ , పాండు నాయక్, పట్లవాట్ రాజు, దేవుల నాయక్, రవి నాయక్, మాజీ ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీ,ఎమ్మెల్యేలను సన్మానిస్తున్న గిరిజన నాయకులు సర్పంచులు

## మున్సిపాలిటీ ఎన్నికల్లో పోటీపడుతున్న బీఆర్ఎస్ నాయకులు

**భూత్పూర్,జనవరి 8,ప్రభాతవార్త :** త్వరలో జరిగే మున్సిపాలిటీ ఎన్నికల్లో ఆయా వార్డుల అభ్యర్థిత్వాలకు బీఆర్ఎస్ నాయకులు పోటీపడుతున్నారు.ఆయా వార్డుల్లో అభ్యర్థుల్ని ఖరారు చేసేందుకు గత వారం రోజుల నుంచి పార్టీ మండల అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ నేతృత్వంలో పార్టీ సీనియర్ నాయకులు వార్డుల్లో విస్తృతస్థాయి సమావేశాలేర్పాటు చేస్తూ ఏకాభిప్రాయం కుదుర్చేందుకు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు.ఇప్పటికే మున్సిపాలిటీలోని 4,9,10వార్డుల్లో పోటీకి సిద్దమైన వారు పేర్లను పరిశీలించారు.నాల్గొవార్డు నుంచి గడ్డం ప్రేమ్‌కుమార్(ఎస్సీ),టి మురళిధర్‌గౌడ్(టీఎంగౌడ్),సత్తూర్ సురేష్‌కుమార్,చీపుర్ల తిరుపతయ్య,బైకాని శివ(బీసీ) వార్డు సభ్యుని పదవీ కోసం తమ అభ్యర్థిత్వాలను ఖరారు చేయాలని పార్టీ అధ్యక్షుడికి దరఖాస్తు చేసుకున్నారు.తొమ్మిదో వార్డు నుంచి టీఎంగౌడ్,ఎస్ఎన్‌గౌడ్(బీసీ),యాసిన్, ఖయ్యూం, ఆహ్మద్‌లతో పాటు రాము రాథోడ్(ఎస్టీ),తూము శ్రీనివాస్‌రెడ్డి(జనరల్) పోటీ పడుతున్నారు. పదోవార్డు నుంచి మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్,ఎస్ఎన్ గౌడ్,జీవీ రాజు(బీసీ),ఎండి ఖదీర్‌లతో పాటు డీలర్ నర్సింహులు,గడ్డం రాములు,గడ్డం భీమస్వామి(ఎస్సీ)లు పోటీపడుతున్నారు.వీరందరూ తాము పోటీలో ఉంటామని పార్టీ అధ్యక్షుడు సత్తూర్ బస్వరాజ్‌గౌడ్‌కు తమ దరఖాస్తులను సమర్పించారు.

## మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**లింగాల, జనవరి 8 ప్రభాతవార్త:** మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలని ఎపిఎమ్ విజయ,సిసి రూప్ సింగ్ అన్నారు. గురువారం లింగాల మండల పరిధిలోని కొత్తకుంటపల్లి గ్రామంలోని మహిళా సంఘాల సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సిసి రూప్ సింగ్ మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించుకొని ఆర్థికంగా స్థిరపడాలని కోరారు. ఎంఎస్ఎస్ ఈ రంగంలో చిన్న చిన్న వ్యాపారాల ఏర్పాటు,వాటి నిర్వహణ వాటి అవసరమైన సంపూర్ణ సహాయ సహకారాలు అందిస్తామని కోరారు. స్వశక్తి మహిళా సంఘాల సభ్యులు ఆర్థిక రంగంలో ఎదగాలని సూచించారు. స్వశక్తి మహిళా సంఘాలను మార్కెట్లో విస్తరింపజేసి కిరాణా షాపు,పిండిగిర్ని వంటి వాటిని ఏర్పాటు చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో విఓఏ మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.



కొత్తకుంటపల్లిలో మహిళా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న సిసి రూప్ సింగ్

## లయన్స్ క్లబ్ ఆఫ్ ఆధ్వర్యంలో అన్న ప్రసాదం

### అన్నదానం మహాదానం-ఎస్సై మాధవరెడ్డి

**కల్వకుర్తి, జనవరి 8ప్రభాతవార్త:**ఆకలితో ఉన్నవారికి అన్న ప్రసాదం పంపిణీ చేయడం గొప్ప విషయమని కల్వకుర్తి ఎస్ఐ మాధవరెడ్డి అన్నారు. గురువారం లయన్స్ క్లబ్ కల్వకుర్తి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన అన్న ప్రసాద పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి ప్రారంభించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త జూలూరు రమేష్ బాబు కుమారుడు జూలూరు రోహిత్ జన్మదినం సందర్భంగా అన్నప్రసాద పంపిణీ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ సామాజిక సేవలో లయన్స్ క్లబ్ ఇంటర్నేషనల్ ఎల్లప్పుడు అగ్రస్థానంలో ఉంటుందన్నారు. బస్టాండుకు వచ్చి పోయే ప్రయాణికుల ఆకలి తీర్చేందుకు చేపట్టిన ఈ కార్యక్రమం ఎంతో మేలు చేస్తుందని ఎస్సై మాధవరెడ్డి తెలిపారు. 350 మందికి అన్నప్రసాదం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ కల్వకుర్తి అధ్యక్షులు చిగుల్లపల్లి శ్రీధర్ మాట్లాడుతూ రాబోయే రోజులు మరిన్ని సామాజిక సేవలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షుడు శ్రీధర్, కార్యదర్శి కల్మిచర్ల గోపాల్, మెంబర్షిప్ కమిటీ చైర్మన్ గుబ్బ కిషన్, మాజీ కోశాధికారి గోవిందు శ్రీనివాస్, ప్రచార కార్యదర్శి దారమోని గణేష్, మేకల శ్రీనివాస్, శివ జగదీశ్వర్, మాచిపెద్దిఅశోక్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాద కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

## సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

### సర్పంచ్ అరుణ పాండురంగారెడ్డి

**వంగూరు,జనవరి 8 ప్రభాతవార్త:** పల్లెల్లో ఏర్పడిన సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పనిచేస్తామని సర్పంచ్ అరుణ పాండురంగారెడ్డి అన్నారు. గురువారం వంగూరు మండల పరిధిలోని మిట్ట సదగోడు గ్రామపంచాయతీ కార్యాలయంలో సాధారణ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో గ్రామంలో నెలకొన్న సమ స్యల పరిష్కారంతో పాటు,ప్రజల సమస్యలను పరిష్కరించడంపై చర్చించారు. గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి రహదారికి ఇరువైపులా ఉన్న మొక్కలను తొలగిస్తే ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా చేయవచ్చని అన్నారు. మురుగు కాలువల సమస్యను పరిష్కరించాలని సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీలో ఉన్న ప్రతి స్తంభానికి ఎల్ఈడి లైట్లు ఏర్పాటు చేయడానికి, పారిశుద్ధంకు మొదటి ప్రాధాన్యతను కల్పించి గ్రామాన్ని అభివృద్ధి పరిచేవిధంగా నిర్ణయాలు తీసుకున్నారు.కార్యక్రమంలో ఉప సర్పంచు జంగిటి రజిత, పంచాయతీ కార్యదర్శి మహేందర్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సర్పంచ్ అరుణ పాండురంగారెడ్డి

## ఘనంగా ఎమ్మెల్యే మేఘా రెడ్డి జన్మదిన వేడుకలు

**అడ్డాకుల జనవరి 8 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గ శాసన సభ్యులు తూడి మేఘారెడ్డి జన్మదిన వేడుకలు మండల పరిధిలో బలీదుపల్లి కాంగ్రెస్ పార్టీ గ్రామ సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఘనంగా జన్మదిన వేడుకలు నిర్వహించడం జరిగింది. అనంతరం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులతో కలిసి సర్పంచ్ కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ రాధ శివ ,వార్డు మెంబర్లు కలిసి కేక్ కట్ చేసి ఘనంగా సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి, ఉప సర్పంచ్ ఎర్రజముని రాధ శివ, వార్డు మెంబర్లు ఎండి రసూల్, ఎస్ .రాములు, మంద కృష్ణ, దేవరాజ్ యాదవ్, ప్రవీణ్ కుమార్ రెడ్డి, మన్యం తదితరులు పాల్గొన్నారు.



### మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకంపై

# ముగిసిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ

**నారాయణ పేట, జనవరి 8 ప్రభాతవార్త :** నారాయణ పేట జిల్లాలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ పథకంతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదని ముక్తకంఠంతో ఏకాభిప్రాయం తెలిపిన ప్రజాప్రతినిధులు, రైతులు, రైతు సంఘాల సభ్యులు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి దామరగిద్ద తండాలో నిర్వహించిన పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం ప్రశాంతంగా ముగిసింది. మక్తల్, నారాయణపేట, కొడంగల్ నియోజకవర్గాల పరిధిలోని ఏడు మండలాల నుంచి ప్రజాప్రతినిధులు,రైతు సంఘాలనాయకులు,విశ్రాంత ఉద్యోగులు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈసందర్భంగా పాల్గొన్న వారందరూ ముక్తకంఠంతో ఈ ఎత్తిపోతల పథకంతో పర్యావరణానికి ఎలాంటి ముప్పు లేదా విఘాతం లేదని స్పష్టం చేస్తూ, వీలైనంత త్వరగా పథకానికి పర్యావరణ అనుమతులు మంజూరు చేసి పనులు ప్రారంభించాలని ఏకాభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయం నుంచి ఈఈ సురేష్ హాజరుకాగా, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను, ఆర్డీవో రామచందర్ నాయక్, నీటిపారుదల శాఖ ఎస్ఈ శ్రీధర్ పాల్గొన్నారు.పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణలో భాగంగా ఏడు మం డలాల నుంచి వచ్చిన వందలాది మంది సమక్షంలో 28మంది వక్తలు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మక్తల్-నారాయణపేట-కొడంగల్ ఎత్తిపోతల పథకాన్ని వెంటనే ప్రారంభించి ఈ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయాలని, సాగు మరియు తాగునీటి అవసరాలను తీర్చాలని వారు కోరారు.ఈ పథకం వల్ల గాలి, నీరు, వాతావరణ కాలుష్యం జరిగే అవకాశమే లేదని, పథకం పూర్తయితే పర్యావరణం మరింత మెరుగుపడుతుందని వక్తలు అభిప్రాయపడ్డారు. చివర్లో ఈఈ సురేష్ మాట్లాడుతూ, ప్రజాభిప్రాయ సేకరణలో వ్యక్తమైన అన్ని అభిప్రాయాలను నమోదు చేశామని, మొత్తం కార్యక్రమాన్ని వీడియో చిత్రీకరణ చేసినట్లు తెలిపారు. సమావేశ మినిట్స్‌తో పాటు వీడియోను కాలుష్య నియంత్రణ మండలికి సమర్పించనున్నట్లు చెప్పారు. ఒక ప్రశ్నకు సమాధానంగా నీటిపారుదల శాఖ ఎస్.ఈ. శ్రీధర్ మాట్లాడుతూ, ఈ పథకం వల్ల ఊట్కూర్ గ్రామం ముంపునకు గురయ్యే ఆస్కారం లేదని స్పష్టం చేశారు. అలాగే ఊట్కూర్ మండల పరిసర ప్రాంతాల్లో సంచరించే జింకల సంరక్షణ కోసం ప్రత్యేక కేంద్రానికి తరలించేందుకు అవసరమైన బడ్జెట్ కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నారాయణపేట మార్కెట్ కమిటీ చైర్మన్ శివారెడ్డి, సింగిల్ విండో అధ్యక్షుడు పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి కుంభం శివకుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ ఈఈ బ్రహ్మానందరెడ్డి, పర్యావరణ కన్సల్టెన్సీ కరీముల్లా, దామరగిద్ద తహసిల్దార్ తిరుపతయ్య, ఎంపీడీవో జయలక్ష్మి శ్రీ, దామరగిద్ద తండా సర్పంచ్ శరణ్ నాయక్, దామరగిద్ద సర్పంచ్ అద్దన్ కనికి రెడ్డి, బాపన్‌పల్లి శ్రీను, వివిధ గ్రామాల మాజీ సర్పంచులు, రైతులు, రైతు సంఘాల నాయకులు, విద్యార్థి సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న అధికారులు

## వాహనదారులు రోడ్డు భద్రత పాటించాలి

### పెబ్బేర్ మోటార్ వెహికల్ ఇన్స్పెక్టర్ (ఎంవీఐ) వాసుదేవరావు

**వీపనగండ్ల. జనవరి 8, ప్రభాతవార్త:**రోడ్డుపై ప్రయాణించే ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతను తప్పనిసరిగా పాటించాలని మోటార్ వెహికల్ అధికారి వాసుదేవరావు ప్రయాణికులను కోరారు గురువారం నాడు రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా వీపనగండ్ల మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు రోడ్డు ప్రమాదాలనివారణపై అవగాహనకార్యక్రమం నిర్వహించారు.ఈసందర్భంగా మాట్లాడుతూ,నేటిసమాజంలో రోడ్డుప్రమాదాలు పెరుగుతున్నాయని,వాటికి ప్రధానకారణం నిర్లక్ష్యమ్లేనని పేర్కొన్నారు.ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు.వాహనం నడుపుతున్న సమయంలో సెల్‌ఫోన్ వినియోగించడం,మద్యం సేవించి డ్రైవింగ్‌చేయడం,నిద్రమత్తులో వాహనం నడపడం వంటి అలవాట్లు ప్రమాదాలకు దారితీస్తాయని హెచ్చరించారు. ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, అలాగే కార్లు నడిపేవారు సీటు బెల్ట్ ధరించాలన్నారు. ఇవి కేవలం చట్టపరమైన నిబంధనలే కాకుండా, ప్రాణరక్షణకు అత్యంత అవసరమని వివరించారు. రోడ్డు సంకేతాలు, ట్రాఫిక్ నియమాలు పాటించడమే ప్రమాదాలను తగ్గించే మార్గమని విద్యార్థులకు వివరించారు.ఈకార్యక్రమంలో విద్యార్థులు పాల్గొని రోడ్డు భద్రతపై సందేహాలు నివృత్తి చేసుకున్నారు. ఇలాంటి కార్యక్రమాలు సమాజంలో రోడ్డు భద్రతపై చైతన్యం తీసుకువస్తాయని ఎంవిఐ వాసుదేవరావు తెలిపారు.కార్యక్రమంలో ఎస్ఐ రాణి, కళాశాల ప్రిన్సిపాల్ శివగౌడ్, కళాశాల అధ్యాపకులు, ఆర్ టి ఏ సిబ్బంది బాషా పాల్గొన్నారు.



రోడ్డు భద్రతలపై మాట్లాడుతున్న మోటార్ వెహికల్స్ అధికారి

## జర్నలిజం విలువలపై అవగాహన సదస్సు

### జాతీయ విద్య భారతి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మురళి మనోహర్

**కల్వకుర్తి, జనవరి 8 ప్రభాతవార్త:** కల్వకుర్తి పట్టణానికి చెందిన స్వామివివేకానంద సేవా బృందం ఆధ్వర్యంలో జాతీయ యువజన దినోత్సవం స్వామివివేకానంద జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానిక ప్రభుత్వ మాడల్ డిగ్రీ కళాశాలలో సమాజంలో జర్నలిజం విలువలు, ప్రభావం అంశం పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముందుగా స్వామివివేకానంద చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా, వక్తగా జాతీయ విద్య భారతి ఉపాధ్యక్షులు ప్రొఫెసర్ మురళి మనోహర్ హాజరయ్యారు. అనంతరం ప్రొఫెసర్ మురళి మనోహర్ మాట్లాడుతూ యువత దేశానికి భారం కావొదని, అన్ని రంగాల్లో రాణించాలన్నారు. యువత చదువుతో పాటు సామజిక స్పృహ పెంచుకోవాలని, ఇంగ్లీష్ పై పట్టు సాధించాలని, జర్నలిజం వలన సామజిక చైతన్యం జరుగుతుందన్నారు. వివేకానంద ఆశయాలు యువతకు ఆదర్శమని కోరారు. అనంతరం పట్టణ సీనియర్ జర్నలిస్టులు ప్రహలాద్, శేఖర్‌గౌడ్‌లు సమాజంలో జర్నలిస్ట్‌ల పాత్ర సేవలు ఎలా ప్రభావితం చేస్తాయని తెలిపారు. అలాగే అతిథులకు స్వామివివేకానంద చిత్రపటాలను బహుకరించారు. కార్యక్రమంలో స్వామివివేకానంద సేవా బృందం అధ్యక్షుడు శివ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీపాద శార్వని, నాయకులు దుర్గాప్రసాద్, బోడ నర్సింహా, ఏబీవీపీ మల్లేష్ యాదవ్, భగత్ సింగ్, సేవా బృందం సభ్యులు లక్ష్మి నరసింహ, గౌతమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




సీనియర్ జర్నలిస్టులకు మెమెంటోలను బహుకరిస్తున్న దృశ్యం

## బీసీ సబ్ ప్లాన్ తక్షణమే అమలు చేయాలి

### టిఆర్‌పి పార్టీ జిల్లా యూత్ అధ్యక్షులు రవికుమార్

**శ్రీరంగాపూర్, జనవరి 8 ప్రభాతవార్త :** ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ తరహాలోనే వెనుకబడిన తరగతుల తీది సమగ్ర అభివృద్ధి కోసం చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్‌ను తక్షణమే అమలు చేయాలని తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న పిలుపునిచ్చారు. రాష్ట్ర యూత్ అధ్యక్షులు బొడ్డుపల్లి చంద్రశేఖర్ ఆదేశాల మేరకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ వనపర్తి జిల్లా యూత్ అధ్యక్షులు జి.రవికుమార్, శ్రీరంగాపూర్ మండల డిప్యూటి తహసీల్దార్ అనురాధకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర జనాభాలో సగానికి పైగా ఉన్న బీసీల సామాజిక, ఆర్థిక విద్య అభివృద్ధి కోసం ప్రత్యేక బడ్జెట్ కేటాయింపులు చట్టపరమైన రక్షణ అత్యంత అవసరమని అన్నారు. 2014 నుంచి ఇప్పటివరకు బీసీల కోసం బడ్జెట్లో కేటాయించిన నిధులను పూర్తిస్థాయిలో ఖర్చు చేయకుండా మిగులు చూపడం వల్ల బీసీలకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. బీసీల జనాభా నిష్పత్తికి అనుగుణంగా రాష్ట్ర బడ్జెట్లో కనీసం 50 శాతం పైగా నిధులు కేటాయించాలన్నారు. నినాదాలతో కాకుండా నిధులతో కూడిన చట్టబద్ధమైన బీసీ సబ్ ప్లాన్ ద్వారానే బీసీలకు నిజమైన సామాజిక న్యాయం సాధ్యమవుతుందని తెలియజేశారు.



డిప్యూటి తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

## తిర్మాలపూర్‌లో రోడ్డు భద్రతపై అవగాహన

### రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు అరికట్టాలి .. అచ్చంపేట డివిజన్ పోలీస్ అధికారి పల్లె శ్రీనివాసులు

**ఉప్పునుంతల, జనవరి 8 ప్రభాతవార్త :** వాహన చోదకులు రోడ్డు నిబంధనలు పాటించి ప్రమాదాలు అరికట్టాలని అచ్చంపేట పోలీస్ డివిజన్ అధికారి పల్లె శ్రీనివాసులు సూచించారు. గురువారం మండలంలోని తిరుమలాపూర్ గ్రామంలో ఎస్సై వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట పోలీస్ డివిజన్ అధికారి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ వాహన చోదకులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మేఘ నియంత్రణ, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని దీంతో ప్రమాదాలను నివారించవచ్చని అవగాహన కల్పించారు. అదేవిధంగా సైబర్ క్రైమ్, బాల్య వివాహాలు, గ్రామాలలో సీసీ కెమెరాల ఏర్పాటు లాంటి అంశాలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన సదస్సులో అచ్చంపేట పోలీస్ డివిజన్ అధికారి పల్లె శ్రీనివాసులు, అచ్చంపేట సీఐ నాగరాజు, ఉప్పునుంతల ఎస్సై వెంకట్ రెడ్డి, గ్రామ సర్పంచ్ బరిగెల శ్రీకాంత్, ఉప సర్పంచ్ రాసమల్ల రేణయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.



తిరుమలాపూర్‌లో వాహన చోదకునికి హెల్మెట్ అందజేస్తున్న డిఎస్పీ పల్లె శ్రీనివాసులు

## యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో విద్యార్థులకు పోటీలు

**కల్వకుర్తి, జనవరి 8 ప్రభాతవార్త:**సేవ్ ఎన్విరాన్మెంట్-సేవ్ పబ్లిక్ స్కూల్ మరియు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహిస్తున్నట్లు యూత్ ఫర్ సేవా సభ్యులు తెలిపారు. జనవరి 12 స్వామి వివేకానంద జయంతి మరియు జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా స్థానిక కల్వకుర్తి పట్టణంలో వివిధ పాఠశాలల్లో 7, 8 తేదీలలో స్కూల్ లెవెల్, ఇంటర్మీడియట్ లెవెల్,మరియు డిగ్రీస్థాయిలలో చిత్రలేఖన పోటీలు, వ్యాస రచన మరియు ఉపన్యాస పోటీలను సేవ్ ఎన్విరాన్మెంట్ మరి యు పబ్లిక్ స్కూల్స్, యూత్ ఫర్ సేవ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి పాఠశాల నుంచి ఒక్కొక్క కంపిటేషన్‌లో ఇద్దరినీ ఎంపిక చేసి 10న స్థానిక శిశు మందిర్ పాఠశాలలో విద్యార్థులకు ఫైనల్ రౌండ్ లోపల గెలిచిన విజేతలకు మొదటి బహుమతిగా రూ.3 వేలు, 2వ బహుమతిగా రూ.1500లు, మూడో బహుమతిగా రూ.500 రూపాయలు వీటితో పాటుగా సర్టిఫికేట్ మెమంటో అందజేయబడుతుందన్నారు. కావున కల్వకుర్తి పట్టణంలోని విద్యార్థి, విద్యార్థినీలు ఈ చక్కని అవకాశాన్ని ఉపయోగించుకొని 10వ తేదీన నిర్వహించే కార్యక్రమానికి తల్లిదండ్రులు విద్యార్థులు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సేవ్ ఎన్విరాన్మెంట్-సేవ్ పబ్లిక్ స్కూల్ మరియు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో నిర్వహించే పోటీలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో యూత్ ఫర్ సేవా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న దృశ్యం

### కలిసి కట్టుగా పనిచేద్దాం..

## గ్రామాన్ని అభివృద్ధి చేద్దాం..

### రాజాపూర్ సర్పంచ్ కావలి రామకృష్ణ



మాట్లాడుతున్న సర్పంచ్ కావలి రామకృష్ణ

**రాజాపూర్, జనవరి 8 ప్రభాతవార్త :** ఉప సర్పంచ్, వార్డు సభ్యులు అందరం కలిసి కట్టుగా పనిచేసి రాజాపూర్ గ్రామ పంచాయతీని అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేద్దామని రాజాపూర్ సర్పంచ్ కావలి రామకృష్ణ అన్నారు. గురువారం రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి వార్డులో ఉన్న తాగునీటి, సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు ఏ సమస్యలు ఉన్నా సమన్వయంతో పనిచేసి పంచాయతీని అభివృద్ధి చేసుకుందామని అన్నారు.

## అమ్మ తల్లి వ్యాధి నిరోధక టీకాలు

**అలంపూర్ జనవరి 8, ప్రభాతవార్త :** గురువారం పశు వైద్య, పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశు వైద్య సిబ్బంది వడ్డేపల్లి మండలం పైపాడులో గొర్రెలు,మేకలకు అమ్మతల్లీ వ్యాధి నిరోధక టీకాలు వేసినారు. ప్రతీ, గొర్రె, మేక కు తప్పకుండ టీకాలు చేయించు కోవాలని మండల పశు వైద్య అధికారి డాక్టర్. స్వరూపరాణి అన్నారు. గొర్రెలు మేకల కాపర్లు కార్యక్రమంను సద్వినియోగం చేసుకోవాలన్నారు. వ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా ఉండాలన్నారు. టీకాలు చేయించు కుంటే వ్యాధి నిరోధక శక్తి లభించి ఆరోగ్యం గా ఉంటాయాన్నారు.వెటర్నరీ లైవ్ స్టాక్ అధికారి (వి ఎల్. ఒ )వర ప్రసాద్, ఒ. ఎస్.లు రవికిరణ్, వెంకటమ్మ, కృష్ణ పాల్గొన్నారు.

## ఓవరాల్ ఛాంపియన్స్‌గా కొండాపూర్ గిరిజన విద్యార్థులు




ఛాంపియన్‌లుగా నిలిచిన విద్యార్థుల జట్టు

**ధన్వాడ, జనవరి 8 ప్రభాతవార్త :** నారాయణపేటలోని గ్రౌండ్ స్కూల్ మైదానంలో 7-8 తేదీల్లో జరిగిన జిల్లా స్థాయి పీఎం శ్రీ పాఠశాల క్రీడల్లో కొండాపూర్ గిరిజన గురుకులం బాలురు ఓవరాల్ ఛాంపియన్స్‌గా నిలిచారు. వాలీబాల్, కోకో, ఫుట్‌బాల్, కబడ్డీలో మొదటి బహుమతి సాధించారు. అథ్లెటిక్స్‌లో అరవింద్ (లాంగ్ జంప్ - 2వ బహుమతి), బాలాజీ (100 మీటర్లు - 1వ బహుమతి), దినేష్ (షాట్‌పుట్ - 1వ బహుమతి) మెరిశారు.ఈ విజయంతో రాష్ట్ర స్థాయి పీఎం శ్రీ క్రీడా పోటీలకు అర్హత సాధించినట్లు ప్రిన్సిపాల్ రాజారాం, కోచ్ డా. రామ్మోహన్ గౌడ్ తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పీఈటీ ఆంజనేయులు, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

## దళితవాడలో చెత్తను తొలగించాలి

**వీపనగండ్ల జనవరి 8, ప్రభాతవార్త:** మండలంలోని గోపాల్ దిన్నె గ్రామంలోని దళితవాడలో చెత్త చెదారం తో పాటు మురికి కాల్వలను పరిశుభ్రంగా చేయాలని ఆ గ్రామ పారిశుధ్య కార్మికు లకు ఆదేశించారు ఈ సందర్భంగా గోపాల్దిన్నె సర్పంచ్ దొడ్ల కవిత గ్రామంలోని దళితవాడలను తిరుగుతూ ఉన్న అపరిశుభ్ర తను ప్రజలకు తెలియజేశారు ఇల్లు పరిసర ప్రాంతాలు రోడ్లు పరిశుభ్రంగా లేకపోతే ప్రజలు అనేక రోగాలకు గురి కావాల్సి వస్తుందని దానితోపాటు రోగాలకు డబ్బులు ఖర్చు చేసుకోవాల్సి వస్తుందని ఆమె ఈ సందర్భంగా వారికి తెలియజేశారు ఈమె వెంట పంచాయితీ కార్యదర్శి వార్డ్ మెంబర్ చంద్రయ్య రైతు సంఘం వనపర్తి జిల్లా అధ్యక్షులు దొడ్ల బాల్రెడ్డి పారిశుధ్య కార్మికులు ఉన్నారు.

## ఉప్పల వెంకటేష్‌ను కలిసిన సర్పంచ్

**వెల్దండ,జనవరి 8, ప్రభాతవార్త:**ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్,మిషన్ భగీరథ మాజీ వైస్ చైర్మన్ ఉప్పలవెంకటేష్‌ను గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో చెదురుపల్లి సర్పంచ్ ధన్‌సింగ్‌నాయక్ మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సన్మానించారు.గ్రామఅభివృద్ధికి సహకరించాలని ఉప్పల వెంకటేష్‌ను కోరారు. కార్యక్రమంలో నాయకులు పోలే అశోక్, పూరి రమేష్, శివ యాదవ్, శేఖర్, తిరుపతయ్య గౌడ్, మహేష్‌గౌడ్ తో పాటు తదితరులున్నారు.

## హిందూపూర్ గ్రామానికి క్రికెట్ కిట్ పంపిణి

**కృష్ణ,జనవరి8 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర క్రీడా శాఖ మంత్రి డా.వాకిటిశ్రీహరి,స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, మండల అధ్యక్షులు రాజప్పగౌడ ఆదేశాలమేరకు హిందూపూర్ గ్రామ యువకులకు గ్రామపంచాయతీ కార్యాలయం దగ్గర కాంగ్రెస్ నాయకులు క్రికెట్ కిట్టును అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మహేష్, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుకు షేక్ సర్ఫరాజ్,గ్రామఅధ్యక్షులు శేకప్పగౌడ,ఉపసర్పంచ్ వాకిటి బాబు,పల్లె సురేష్, గ్రామ యువకులు తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ చీరల పంపిణీ



మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న దృశ్యం

**నవాబుపేట, జనవరి 8 ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి పేద మహిళకు ఇందిరమ్మ చీరలు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం ఇందిరమ్మ చీరల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేసింది. అందులో భాగంగా నవాబుపేట మండల పరిధిలోని కాకర్లపాడు గ్రామంలో గురువారం ఇందిరమ్మ చీరల పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా చీరలు అందని గ్రామాలలో ప్రతి మహిళకు సంక్రాంతి పండుగలోపు పంపిణీ చేయనున్నారని సర్పంచ్ బాలయ్య గ్రామ ప్రజాప్రతినిధులు ఈ సందర్భంగా అన్నారు. చీరలు అందని మహిళలు ఎలాంటి ఆందోళన చెందవద్దని గ్రామంలోని ప్రతి మహిళకు చీరలు అందజేస్తామని ఈ సందర్భంగా వారు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్, ఉపసర్పంచ్‌లతోపాటు గ్రామస్తులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.



**లింగాల, జనవరి 8 ప్రభాతవార్త :** రాష్ట ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ చీరలను శాయిన్‌పేట సర్పంచ్ మంజుల సుభాష్ రెడ్డి గురువారం గ్రామంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మంజుల మాట్లాడుతూ మహిళా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తుందన్నారు. ముఖ్యంగా ఇందిరమ్మ క్యాంటిన్, ఇందిరమ్మ హౌసింగ్, మహిళా శక్తి బృందాల అభివృద్ధికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. గ్రామస్తులు చందర్, మహిళా సంఘాల సభ్యులు పాల్గొన్నారు.

## గ్రామంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి

**బిజినేపల్లి, జనవరి 8 ప్రభాతవార్త:** గ్రామంలో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సర్పంచ్ బోనాసి రామకృష్ణ అన్నారు. గురువారం గ్రామంలో పరిశుద్ధ్య పనులు చేపట్టారు. వ్యర్థ పదార్థాలు పేరుకుపోకుండా ఎప్పటికప్పుడు గ్రామంలో పారిశుద్ధ్య పనులు, కాలువల్లో మురుగునీరు నిలిచిపోకుండా చూడాలని ఆదేశించారు. అలాగే తాగునీరు కలుషితం కాకుండా చూడాలని సూచించారు. ఇంటింటికీ ఘన వ్యర్థాల సేకరణ, వాటిని తడి, పొడి చెత్తగా వేరు చేయడం, కంపోస్టింగ్ ప్రోత్సాహం ద్వారా వ్యర్థాల నిర్వహణ చేపట్టాలన్నారు. పరిశుభ్రమైన గ్రామంగా నిర్మించడం లక్ష్యంగా ముందుకు సాగాలన్నారు.

## అభివృద్ధి పనులు మంజూరు చేయాలని వినతి



అభివృద్ధి పనులకై వినతి పత్రం సమర్పించిన దృశ్యం

**మద్దూరు, జనవరి8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా మద్దూరు మండలం దొరపల్లి గ్రామంలో మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని గ్రామ సర్పంచ్ కె. కవిత అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ నరేష్‌లు కొడంగల్ కడ ప్రత్యేక అధికారి వెంకటరెడ్డిని కోరారు. ఈ సందర్భంగా వారు వినతి పత్రం సమర్పిస్తూ గ్రామంలో అండర్ డ్రైనేజీ వ్యవస్థ, ఎస్సీ కమ్యూనిటీ హాల్, బీసీ కమ్యూనిటీ హాల్, పశు వైద్యశాల, అంగన్‌వాడి భవనం నిర్మాణం, అలాగే శుద్ధి చేసిన మంచినీటి సరఫరా వంటి పలు అభివృద్ధి పనులు చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. గ్రామ ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడేందుకు ఈ అభివృద్ధి పనులు ఎంతో అవసరమని, సంబంధిత శాఖల ద్వారా త్వరితగతిన చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమానికి గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## సైబర్ వారియర్స్‌కు ఎస్పీ అభినందన

### డీజీపీ చేతుల మీదుగా ప్రశంసలు



సైబర్ వారియర్స్‌ను అభినందిస్తున్న ఎస్పీ జానకి

**మహబూబ్‌నగర్ క్రైమ్, జనవరి8 ప్రభాతవార్త:** సైబర్ నేరాల నియంత్రణ, సైబర్ అవగాహన కార్యక్రమాలలో ఉత్తమ సేవలు అందించినందుకు గాను మహబూబ్‌నగర్ జిల్లా సైబర్ వారియర్ పోలీస్ కానిస్టేబుళ్లకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందుకున్నారు. రాష్ట్రస్థాయిలో ప్రశంసలు అందుకున్న అనంతరం గురువారం సంబంధిత సైబర్ వారియర్ కానిస్టేబుళ్ల జిల్లా ఎస్పీ డి. జానకి ఛాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ వారికి అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో కూడా సైబర్ నేరాల నియంత్రణలో మరింత సమర్థవంతమైన సేవలు అందించాలని ఆకాంక్షించారు. ప్రశంసలు అందుకున్న సైబర్ వారియర్ కానిస్టేబుళ్ల వివరాలు:1. ఎం.మధు గౌడ్, పిసి-2216, మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్2. వికాస్ రెడ్డి, పిసి-118, మహబూబ్‌నగర్ వన్ టౌన్ పోలీస్ స్టేషన్.3. శ్రీనివాసులు, పిసి-2230,దేవరకద్ర పోలీస్‌స్టేషన్. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, సైబర్ క్రైమ్ సబ్ ఇన్స్పెక్టర్ శ్రావణ్ పాల్గొన్నారు. సైబర్ నేరాల నియంత్రణలో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల కృషికి రాష్ట్రస్థాయిలో గుర్తింపు లభించడం పట్ల జిల్లా పోలీసు శాఖ హర్షం వ్యక్తం చేసింది.

## రోడ్డు భద్రత నియమాలు ప్రతి ఒక్కరూ పాటించాలి

(మొదటి పేజీ తరువాయి)



కూడా అవగాహన కల్పించాలన్నారు. రోడ్డు ప్రమాదాల కారణంగా ప్రతి నాలుగు నిమిషాలకు ఒకరు మరణిస్తున్నారని తెలిపారు. ఇటీవల కాలంలో రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న నేపథ్యంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు రోడ్డుభద్రత వారోత్సవాలను మాసోత్సవాలుగా నిర్వహిస్తున్నార న్నారు. జిల్లా ఎస్పీ డి.సునీత మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల ద్వారా నిత్యం ఎంతో మంది మరణిస్తున్నారని, కాబట్టి ప్రజలు ప్రతి ఒక్కరూ రోడ్ సేఫ్టీ పాటిస్తూ ఇతరులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలకి ఆధునిక ద్విచక్ర వాహనాలు కొనివ్వడమే కాకుండా వారు అత్యధిక వేగంతో వెళ్లకుండా కంట్రోల్ కూడా చేయాలన్నారు. యువత అధిక వేగం వల్ల అనర్థాలను కొని తెచ్చుకోవద్దని సూచించారు. యువత కొంత మంది స్టైల్ కోసం హెల్మెట్ ధరించకుండా నిర్లక్ష్యం చేస్తారని, ఆ పద్ధతి ప్రాణాలకే ముప్పు తెస్తుందనిచెప్పారు. కాబట్టి ప్రతి ఒక్కరు బైక్‌పై వెళ్లేటప్పుడు రోడ్‌సేఫ్టీ రూల్స్ పాటిస్తూ హెల్మెట్ ధరించి వెళ్లాలని తెలియజేశారు. బైక్ ర్యాలీ సందర్భంగా నల్లచెరువు కట్టపై రోడ్డు భద్రతపై అవగాహన కల్పిస్తూ తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులతో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమాలుఅందరినీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ బాలాజీనాయక్, జిల్లారవాణా శాఖఅధికారి మానస, జిల్లా పౌర సంబంధాల అధికారి సీతారాం, ఇతర అధికారులు, విద్యార్థులు, యువత, పాల్గొన్నారు.

# అట్టహాసంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

◆ ఎమ్మెల్యే జన్మదిన సందర్భంగా మెగా రక్తదాన శిబిరం ◆ 482 యూనిట్ల రక్తదానం

**వనపర్తి ప్రతినిధి, జనవరి8 ప్రభాతవార్త:** వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి జన్మదినాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అట్టహాసంగా నిర్వహించారు. గురువారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా వనపర్తి పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరంలో రికార్డ్ స్థాయిలో రక్త సేకరణ జరిగింది. రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మెగా రక్తదాన శిబిరం యువశక్తి ఫౌండేషన్ సమన్వయంతో 482 యూనిట్ల రక్తాన్ని సేకరించినట్టు అధికారులు తెలిపారు. ఎమ్మెల్యే జన్మదిన వేడుకలను నియోజకవర్గంలోని పలు మండలాలలోని తన కార్యకర్తల మధ్య జరుపుకున్నారు. మొదటగా ఖిల్లాఘణపురం మండలం గట్టు కాడిపల్లి శ్రీశ్రీశ్రీ వెంకటేశ్వర స్వామివారి ఆలయంలో కుటుంబ సమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వృద్ధులకు అన్నదాన పంపిణీ కార్యక్రమం ప్రారంభించి, చిట్యాల గ్రామ శివారులోని చేయూత





విద్యార్థులకు నోట్‌బుక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

అనాధాశ్రమం వారు వృద్ధులకుభోజన పంపిణీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పామిరెడ్డిపల్లి పాఠశాలలో విద్యార్థులకు నోట్‌బుక్కులు, పెన్నులను పంపిణీ చేశారు. అనంతరం వనపర్తి పట్టణంలోని మరికుంటలోని బాలికల గిరిజన గురుకుల పాఠశాలలో ఏర్పాటుచేసిన పుట్టినరోజు వేడుకల్లో ఎమ్మెల్యే కుటుంబ సమేతంగాపాల్గొన్నారు. ఈ కార్యక్రమాలలోనియోజకవర్గంలోని కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రముఖులు, అధికారులు, యువకులు, మహిళలు పాల్గొన్నారు.

# పదో తరగతి ఉత్తీర్ణత శాతం అత్యధికంగా ఉండాలి

◆ వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ◆ ఎంఈఓలు, క్లస్టర్ హెడ్మాస్టర్లతో కలెక్టర్ సమీక్ష

**వనపర్తి, జనవరి 8 ప్రభాతవార్త :** మునుపెన్నడు లేని విధంగా ఈ విద్యా సంవత్సరంలో 10వ తరగతి ఉత్తీర్ణత శాతం అత్యధికంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా విద్యా అధికారి ఆధ్వర్యంలో యంఈఓలు, క్లస్టర్ హెడ్మాస్టర్లతో కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ విద్యా సంవత్సరం ఆరంభం నుండి విద్యా శాఖ పై ప్రత్యేక దృష్టి పెట్టి అనేక లోపాలను సరిదిద్దడం, అవసరమైన మౌలిక వసతులు కల్పించడం జరిగిందని అందువల్ల మునుపెన్నడూ సాధించని విధంగా 10వ తరగతిలో విద్యార్థులు అత్యధికంగా పాస్ అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటి నుంచే చదువులో కాస్త వెనుక బడిన విద్యార్థులను గుర్తించి వారికి షెడ్యూల్ ప్రకారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని, రివిజన్‌పరీక్షలు నిర్వహించి తిరిగి మరొకమారు అవగాహన కల్పించాలని తెలియజేశారు. ముఖ్యంగా మ్యాథమాటిక్, ఇంగ్లీష్, సైన్స్ సబ్జెక్టుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలని, ఈ సబ్జెక్టుల్లో వనపర్తి జిల్లా నుండి ఏ ఒక్క విద్యార్థి ఫెయిల్ కాకుండా బోధించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలకు



విద్యాధికారులతో సమావేశమైన జిల్లా కలెక్టర్

మధ్యాహ్న భోజనం వంటకాల కొరకు సిలిండర్ గ్యాస్ ఇవ్వడం జరిగిందని, వాటిని ఉపయోగించి మాత్రమే వంటలు చేయాలని తిరిగి కట్టెల మీద వంటలు చేయకుండా చూసుకోవాలని సూచించారు. మండల విద్యా అధికారులు క్రమం తప్పకుండా పాఠశాలల సందర్శన చేసి ఎప్పటికప్పుడు విద్యాపరంగా సమస్యలు గుర్తించి పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లా విద్యా అధికారి అబ్దుల్ ఘని, యంఈఓ లు, క్లస్టర్ హెడ్మాస్టర్లు, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నాగర్‌కర్నూల్ నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

15 కోట్ల రూపాయలు, శ్రీపురం సమీపంలో ఎలక్ట్రికల్ స్టోర్ కోసం నాలుగు కోట్ల రూపాయలు మంజూరయ్యాయని ఎమ్మెల్యే తెలిపారు. నూతన సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణం, తోపాటు ఎస్పీ కార్యాలయం వెనుక భాగంలో ఆర్టీఏ కార్యాలయం నిర్మాణం జరుగుతుందన్నారు. అదే విధంగా పట్టణానికి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ కూడా మంజూరైందని, సెరికల్చర్ కార్యాలయ స్థలాన్ని కూడా అందించడం జరిగిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపడం జరిగిందని, త్వరలోనే మంజూరు లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కూచకుళ్ళ ఫౌండేషన్ ద్వారా గురుకుల పాఠశాలలో, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల సౌకర్యం కోసం బెంచీలు, గ్రీన్ బోర్డులు, తాగునీటి వంటి వసతుల కల్పన కోసం తమ వంతుగా సహకారం అందించడం జరిగిందన్నారు. డిజిటల్ లైబ్రరీ ఏర్పాటు కోసం నిధులు వంటివి మంజూరు చేయించడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మంత్రులు నాగర్ కర్నూల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం ఏ పని తీసుకువెళ్లిన సానుకూలంగా స్పందించి మంజూరు చేయడం ఈ ప్రాంత ప్రజల అదృష్టమని తాను ఎమ్మెల్యేగా ఉండి పుట్టిన గడ్డకు చేస్తున్న అభివృద్ధిని చూసి గర్వపడుతున్న అన్నారు. రాబోయే మూడేళ్లలో నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసి దేశంలోనే నాగర్‌కర్నూల్ వైపు ప్రజలచూపు ఉండే విధంగా చూస్తానని హామీ ఇచ్చారు. నియోజకవర్గంలో విద్యా వైద్యంతో పాటు రోడ్ల వ్యవస్థను కూడా ఆధునికరించడం అభివృద్ధి చేయడము లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. మున్సి పాలిటీలో పలు అభివృద్ధి కోసం ఇప్పటివరకు 55 కోట్ల రూపాయలు కేటాయించి పనులు చేపించడం జరిగిందన్నారు. నియోజకవర్గంలోని ప్రతి ఆసుపత్రిని అభివృద్ధి చేస్తామన్నారు. ఐదు కోట్లతో మహిళా శక్తి భవనాన్ని నిర్మించడం జరిగిందని త్వరలో పూర్తవుతుందన్నారు. ఒకపక్క అభివృద్ధి మరో పక్క సంక్షేమంతో నియోజకవర్గ ప్రజలకు సేవ చేసుకునే అవకాశం లభించిందన్నారు.

**మున్సిపాలిటీని కైవసం చేసుకుంటాం:** రాబోవు మున్సిపల్ ఎన్నికల్లో అన్ని వార్డుల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను అఖండ మెజార్టీతో గెలిపించుకొని మున్సిపాలిటీని కైవసం చేసుకుంటామని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. కొందరు సర్పంచ్ ఎన్నికల ఫలితాలను బూచిగా చూపి ప్రజలను తప్పుదోవ పట్టించడానికి చూస్తున్నారని, వారికి వచ్చే మున్సిపల్ ఎన్నికలలో తమ రుచి ఏమిటో చూపిస్తామని ఆయన అన్నారు. గతంలో జరిగిన అవినీతి అక్రమాలపై ఒక్కొక్కటిగా సమాచారాన్ని సేకరిస్తున్నానని, అన్యాయాలు, అక్రమాలను బయటపెట్టి ప్రజలకు మేలు చేసే పనులు చేస్తామని, వనరులను కాపాడుకోవడానికి తన వంతుగా కృషి చేస్తానని రాజేష్ రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ వేనేపల్లి రమణారావు, మాజీ ఎంపీపీ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కోటయ్య యాదవ్, రాష్ట్ర ట్రాన్స్పోర్ట్ అథారిటీ సభ్యుడు గోపాల్ రెడ్డి, మాజీ కౌన్సిలర్లు కొత్త శ్రీనివాసులు, మహమ్మద్ నిజాం, మహమ్మద్ ఖాదర్ తదితరులు ఉన్నారు.

## వృద్ధుడి ప్రాణాలను రక్షించిన మలక్ పేట యశోదా ఆసుపత్రి వైద్య బృందం



పేషెంట్ గురించి మీడియాకు వివరిస్తున్న యశోద డాక్టర్లు

**వనపర్తి, జనవరి 8 ప్రభాతవార్త:** హార్ట్ అటాక్ (అక్యూట్ కొరొనరీ సిండ్రోమ్) అనేది గుండెకు రక్తప్రసరణ అకస్మాత్తుగా ఆగిపోవడం వల్ల ఏర్పడే అత్యంత ప్రమాదకర పరిస్థితి. వెంటనే చికిత్స అందించకపోతే గుండె పని తీరు దెబ్బతినడం, గుండె వైఫల్యం లేదా ప్రాణాపాయం సంభవించే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా వృద్ధులలో గుండె రక్తనాళాల్లో అనేక బ్లాకేజీలు ఉన్నప్పుడు ప్రమాదం మరింత ఎక్కువగా ఉంటుంది. ఈ కేసులో సకాలంలో చేసిన థ్రాంబోలిసిస్, అనంతరం ఆధునిక కార్డియాక్ పరీక్షలు ,సరైన వైద్య నిర్వహణ వల్ల తీవ్రమైన హార్ట్ అటాక్‌కు గురైన వృద్ధ రోగి ప్రాణాలను యశోదా ఆసుపత్రి వైద్యులు కాపాడారు. బైపాస్ శస్త్ర చికిత్సకు సమానంగా కట్టింగ్ బెలూన్ (యాంజియోప్లాస్టి) ప్రత్యేక చికిత్స ద్వారా, హార్ట్ ఎటాక్ గురయ్యే వారి ప్రాణాలు కాపాడవచ్చని, డా.పవన్ పోద్దార్, అసోసియేట్ కన్సల్టెంట్ కార్డియాలజిస్ట్, డాక్టర్ ఏ. రాఘవేందర్‌గౌడ్‌లు తెలిపారు. గురువారం ఓ ప్రైవేటు బ్లాంకెట్ హాల్‌లో కట్టింగ్ బెలూన్"ప్రత్యేక గుండెచికిత్సపై విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వారుమాట్లాడారు అత్యాధునిక వైద్య సదుపాయలతో బైపాస్ శస్త్ర చికిత్స లేకుండా యశోద హాస్పిటల్ వైద్యులు 76 ఏళ్ల వృద్ధునికి కట్టింగ్ బెలూన్ ప్రత్యేక వైద్య పద్ధతుల ద్వారా చికిత్స చేసి ప్రాణాలు కాపాడమని అన్నారు. వనపర్తి పట్టణానికి చెందిన ఎం. కృష్ణ గోకుల్‌దాస్‌కు నవంబర్లో ఛాతిలో నొప్పి రావడంతో చికిత్సకు స్థానిక వైద్యుని కలవడంతో వైద్యుడు ఈసీజీ పరీక్ష నిర్వహించి హార్ట్ ఎటాక్ గా నిర్ధారించి, గుండెకు రక్తప్రసరణ జరిగే ప్రధాన 3 రక్తనాళాలు మూసుకోవడంతో రేటే ప్లేస్ ఇంజక్షన్‌తో తాంబ్రెలిసిస్ చేసి మెరుగైన అధునాతన వైద్య చికిత్స కోసం మలక్‌పేట యశోదహాస్పిటల్‌కు రెఫర్ చేశారన్నారు. యశోద హాస్పిటల్ వైద్యులు కృష్ణ గోకుల్ దాస్‌కు వైద్య పరీక్షలు నిర్వహించి మూడు రక్తనాళాలు మూసుకున్నాయని బైపాస్ శాస్త్ర చికిత్స చేయించుకోవాలని సూచించామనీ.. కానీ వారి కుటుంబ సభ్యులు బైపాస్ సర్జరీ వద్దనడంతో యశోద హాస్పిటల్ వైద్యులు అధునాతన ప్రత్యేక వైద్య పద్ధతుల ద్వారా బహుళ రక్తనాళాల లోపల పరిస్థితిని స్పష్టంగా చూపించే ఇన్ ట్రా వాస్క్యూలర్ ఇమేజింగ్ అల్ట్రా సౌండ్(ఐఈయుఎస్)తో స్క్రీన్ పై రక్తనాళాల్లోని లోపలి స్థితినీ గమనిస్తూ.. "కట్టింగ్ బెలూన్"(యాంజియోప్లాస్టి) వంటి ప్రత్యేక వైద్య పద్ధతితో సమస్యత్మకంగ ఉన్న రక్తనాళాలను వెడల్పు చేస్తూ రక్తప్రసరణ పెరిగే విధంగా చికిత్స చేసి లెఫ్ట్ సర్కం ఫ్లెక్స్ ఆర్టరీ లో 2.25 , 20 మిల్లీమీటర్ల స్టంట్ వేశామన్నారు. ఈ కేసు యశోదా ఆసుపత్రి, మలక్‌పేట్‌లో అందుబాటులో ఉన్న అధునాతన కార్డియాక్ కేర్ సేవలకు, అత్యవసర హార్ట్ అటాక్ నిర్వహణలో వైద్య బృందాల వృత్తి నైపుణ్యానికి అద్భుతమైన ఉదాహరణగా నిలుస్తుంది. అత్యాధునిక అత్యవసర వైద్య సేవలు, ఐసీయూ, ఇంటర్వెన్షనల్ సర్జరీ టీముల సేవలు, నిపుణులైన వైద్య బృందాలు యశోదా ఆసుపత్రి శాఖలన్నింటిలోనూ 24 గంటలూ అందుబాటులో ఉన్నాయని, నిపుణులైన యశోదా వైద్య బృందం ద్వారా అత్యంత క్లిష్టతరమైన జబ్బులు, వ్యాధులకు కూడా చికిత్స జరుగుతోందని మలక్ పేట యశోదా హాస్పిటల్స్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె.శ్రీనివాసరెడ్డి, అసోసియేటెడ్ వైస్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ చిదుర,ఏ వాసు కిరణ్ రెడ్డి తెలిపారు.

## ప్రధాని మోడీ ఎదుట ఐడియా ఆవిష్కరణ

### వనపర్తి విద్యార్థికి అరుదైన అవకాశం



జ్ఞాపకను అందుకుంటున్న నితీష్ రెడ్డి (ఫైల్)

**వనపర్తి, జనవరి8 ప్రభాతవార్త:** కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న వికసిత్ భారత్ యంగ్ లీడర్స్ డలాగ్ (విబివైఎల్‌డి) 2026లో పాల్గొని, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఎదుట తమ వినూత్న ఆలోచనను ప్రదర్శించేందుకు వనపర్తికి చెందిన విద్యార్థి ఎం. నితీష్ కుమార్‌రెడ్డి ఎంపికయ్యారు. వనపర్తి పట్టణంలోని వెంగళరావు కాలనీకి చెందిన నితీష్‌కుమార్‌రెడ్డి, స్థానిక చాణక్య హైస్కూల్‌లో విద్యాభ్యాసం పూర్తిచేసి, ప్రస్తుతం కేరళ సెంట్రల్ యూనివర్సిటీలో బీసీఏ (బిసిఏ) ప్రథమ సంవత్సరం చదువుతున్నారు.

**జనవరి 12న ఢిల్లీలో ప్రదర్శన:** ఈ నెల 9 నుంచి 12 వరకు న్యూఢిల్లీలో జరిగే ఈ జాతీయ స్థాయి సదస్సులో నితీష్, తన సహాధ్యాయిని శ్రీలక్ష్మి నాయర్ (బీకామ్)తో కలిసి పాల్గొననున్నారు. దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు పోటీ పడగా, అత్యుత్తమ ప్రదర్శన కనబరిచిన కొద్దిమందిలో నితీష్ బృందం చోటు దక్కించుకోవడం విశేషం.

ప్రాజెక్ట్ వివరాలు:పెరుగుతున్న సైబర్ నేరాల నుండి, ముఖ్యంగా వృద్ధులను కాపాడేందుకు విశ్వాస్‌వలయ్ అనే స్మార్ట్ పరికరాన్ని వీరు రూపొందించారు. ఈ సందర్భంగా నితీష్ మాట్లాడుతూ.. "నా కుటుంబ సభ్యులు, పాఠశాల ఉపాధ్యాయుల ప్రోత్సాహం, స్ఫూర్తితోనే ఈ విజయం సాధ్యమైంది. జాతీయ స్థాయిలో మనజిల్లా పేరు నిలబెట్టడం ఆనందంగా ఉంది" అని పేర్కొన్నారు. జిల్లా విద్యార్థి జాతీయ స్థాయిలో రాణించి, ప్రధానిని కలిసే అవకాశం దక్కించుకోవడం పట్ల పలువురు విద్యావేత్తలు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

## విద్యార్థులకు పలకల పంపిణీ



**వెల్దండ, జనవరి 8 ప్రభాతవార్త:** వెల్దండ మండల కేంద్రానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకులు బిక్కుమాండ్ల శ్రీనివాసులు కూతురు రమ్య పుట్టినరోజు పాఠశాల విద్యార్థులకు సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఉప సర్పంచ్ ఎర్రశ్రీను ముదిరాజు, శ్రీనివాసులు, బాలరాజు, పుల్లయ్య, రషీద్, తిరుపతిరెడ్డి, అంజయ్య, భరత్‌గౌడ్‌తో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ఉన్నారు.

## పాఠశాలను తనిఖీ చేసిన ఎంఈఓ

**లింగాల, జనవరి 8 ప్రభాతవార్త:** మండలంలోని దత్తారం పాఠశాలను ఎంఈఓ బషీర్ అహ్మద్ గురువారం తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ పాఠశాలలోని పలు రకాల రికార్డులను పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. విద్యార్దుల సామర్థ్యాలను పరిశీలించారు. విద్యార్థులకు పలు రకాల సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ నిలిపివేత

**లింగాల, జనవరి 8 ప్రభాతవార్త:** నేడులింగాల మండల కేంద్రంలో విద్యుత్ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ అప్పలనాయుడు తెలిపారు. నేడు శుక్రవారం అచ్చంపేటలో 132/33కెవి ఇహెచ్‌టి సబ్ స్టేషన్ లో మరమ్మతులు కారణంగా విద్యుత్ సరఫరా మధ్యాహ్నం3 గంటల నుండి సాయంత్రం 5.30 వరకు విద్యుత్ ఉండదని వ్యాపారస్తులు, రైతులు సహకరించాలని కోరారు.

## అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### ప్రారంభించనున్న ఎనుముల తిరుపతిరెడ్డి

**మద్దూరు, జనవరి 8 ప్రభాతవార్త:** కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి ఎనుముల తిరుపతిరెడ్డి శుక్రవారం మద్దూరు మండలంలోని వివిధ గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించనున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గూళ్ల నరసింహులు తెలిపారు. శుక్రవారం ఉదయం 10 గం.లకు మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి అభివృద్ధి పనుల శంకుస్థాపన, ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో ఆయన పాల్గొననున్నారని వెల్లడించారు. ఉదయం 11:45 గంటలకు పర్సాపూర్ గ్రామంలో నూతన అదనపు క్లాస్‌రూమ్‌ను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే పల్లెర్లలో అంగన్‌వాడీ భవనం, చెన్నారెడ్డి పల్లె అంగన్‌డీ భవనం, జాదవరావు పల్లి గ్రామంలోఅండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులు, అల్లిపూర్ గ్రామంలో అంగన్‌వాడీ భవనం సహా పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ప్రారంభ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమాలకు స్థానిక ప్రజా ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఠాగూర్ స్కూల్‌లో విద్యార్థులకు ముగ్గుల పోటీలు

**భూత్పూర్,జనవరి 8,ప్రభాతవార్త :** మరో వారం రోజుల్లో జరగనున్న సంక్రాంతి పండుగను పురస్కరించుకుని ముందస్తుగా భూత్పూర్ పట్టణంలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో గురువారం విద్యార్థినులకు సంక్రాంతి ముగుల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలో విద్యార్థినులు హర్షిక, కార్తీక, సింధు, అక్షిత, కారుణ్య, సంకీర్తన, అక్షర, దీప్తి, తేజస్విని, తులసి తదితరులతో పాటు సంజీవ, మహేష్, అచ్యుత్, ప్రణీత్ తదితరులు పాల్గొని రంగురంగుల రంగవల్లులల్లి ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం మెప్పును పొందారు. రంగవల్లులలో అత్యుత్తమంగా రంగవల్లులల్లిన విద్యార్థినులను పాఠశాల కరస్పాండెంట్ గొడుగు వేదాంతం వెంకటయ్య, ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరి, ఉపాధ్యాయురాళ్లు సన, మాధవి, సృష్టి, పుష్ప, రాణి అభినందించారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థినులకు బహుమతులు అందజేశారు.

## మంత్రి వాకిటి శ్రీహరిని కలిసిన సర్పంచ్‌లు, వార్డు మెంబర్లు



**ధన్వాడ, జనవరి 8 ప్రభాతవార్త :** ధన్వాడ మండలంలోని పాతపల్లి గ్రామ ప్రతినిధులు నారాయణపేట్ జిల్లామక్తల్ శాసనసభ్యులు, మంత్రివర్యులువాకిటి శ్రీహరిని మర్యాదపూర్వకంగా కలిసి గ్రామ సమస్యలను వివరించారు. సర్పంచ్ టేరప్ప,వార్డు మెంబర్ బండశీను, వై. నర్సింలు, వై.రాజు, కే.కథలప్ప, జి.రాములు, తిరుమలయ్య తదితరులు కలిసి నారాయణపేట -పాతపల్లి బిటి రోడ్డు పనులు ప్రారంభించాల్సిన అవసరాన్ని వివరించారు. అలాగే ధన్వాడ-పాతపల్లి మద్దెలవాగు వద్ద వంపు బిర్జులు నిర్మించాలని, గ్రామానికి బస్సు సౌకర్యం కల్పించాల్సిందిగా మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా సమస్యలను శ్రద్ధగా విన్న మంత్రివర్యులు ఒక్కరోజు మీ గ్రామానికి వచ్చి శాంక్షన్ తీసుకుని రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తాను" అని హామీ ఇచ్చారు. తరువాత సర్పంచ్, గ్రామ పెద్దలు మంత్రి శ్రీహరికి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో శివకుమార్ రెడ్డి సహా పలువురు స్థానికులు పాల్గొన్నారు.

## సిద్ధార్థ స్కూల్లో కరాటే కిడ్స్ పోటీ నిర్వహణ

**నవాబుపేట, జనవరి 8 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్లో జీకే మాస్టర్ సోటో కన్ కరాటేడు ఇండియా ఆధ్వర్యంలో నవపేట్ కేంద్రంలోని సిద్ధార్థ స్కూల్లో గురువారం కరాటే బెల్ట్ ఎగ్జామ్ టెస్ట్ నిర్వహించడం జరిగింది. బెల్ట్ ఎగ్జామ్ టెస్టులో ఎల్లో బెల్ట్‌గా 6 మంది, గ్రీన్ బెల్టు 5మంది విద్యార్థులు అలాగే ఆరెంజ్ బెల్ట్ ఐదు మంది విద్యార్థులు, బ్లూ బెల్ట్ ఇద్దరు, మెరూన్ బెల్ట్ ఒకరు, బ్రౌన్ సీనియర్ ఒకరు మొత్తం 20 మంది విద్యార్థులు బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో నవాబ్‌పేట్ గ్రామ సర్పంచ్ గీతా సుధాకర్ చారి, స్కూల్ డైరెక్టర్ భాను ప్రతాప్, కరెస్పాండెంట్ అండ్ ప్రిన్సిపాల్ రూపవతి, సీనియర్ మాస్టర్ఎగ్జామినర్ ఇలియాస్ మాస్టర్, విఐపి అకాడమీ డైరెక్టర్, సీనియర్ మాస్టర్ సయ్యద్, అశ్వ సయ్యద్, అశ్వక్, మాస్టర్ లక్ష్మణ్ నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా ఎమ్మెల్యే తుడి మేఘారెడ్డి జన్మదినోత్సవం

**అడ్డాకుల, జనవరి 8 ప్రభాతవార్త:** వనపర్తి నియోజకవర్గం అడ్డాకుల మండల పరిధిలోని కన్మనూర్, బలీదు పల్లి, చిన్న మునగలచేడు, పెద్ద మునగలచేడు, నాలుగు గ్రామాల కాంగ్రెస్ పార్టీ నాయకులు, వెల్టూరు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆధ్వర్యంలో వెల్టూరు స్టేజి దగ్గర ఎమ్మెల్యే తూడి మేఘా రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్‌కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తూ ఘనంగా సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో బడుగు బలహీన వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయని గత ప్రభుత్వంలో నీటి ప్రాజెక్టుల పేరుతో అందిన కాడికి దోచుకునుడే తప్ప ప్రజలకు మేలు చేసింది ఏం లేదని కాంగ్రెస్ ప్రభుత్వంలో పేదలకు ఇందిరమ్మ ఇండ్లు, 200యూనిట్ల లోపుగృహజ్యోతి, రైతుభరోసా, మహిళలకు ఫ్రీబస్సు, రైతు రుణమాఫీ, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు అనేక సంక్షేమ పథకాలు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో అభివృద్ధి దశలో జరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ప్రేమ్ సాగర్, మాజీ ఎంపిటిసి సి.వెంకటయ్య, దండోరా మహేష్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్ రెడ్డి, దిండు రవి సాగర్, బలీదుపల్లి సర్పంచ్ కోట్ల కరుణాకర్ రెడ్డి, పెద్ద మునగలచేడు, జె.చిట్టిబాబు, నాలుగు గ్రామాల మాజీ సర్పంచులు, మాజీ ఎంపిటిసిలు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మెఘారెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు